# శోభనం రాత్రి

రాత్రికే శోభనం వాసుదేవరావుకి.

క్రితం రాత్రి తెల్లవారుఝాము లగ్నంలో పెళ్ళయింది సుజాతకీ–వాసుదేవరావుకీ. అచ్చట్లూ ముచ్చట్లూ అన్నీ అయ్యేసరికి భళ్ళున తెల్లారింది. కాఫీలయ్యాక ఫ్రెండ్సూ కొంతమంది చుట్టాలూ వెళ్ళిపోయారు. ఇల్లు ఇంకా కావలసినంత సందడిగా వుంది. పెళ్ళికొడుక్కూ అతని తరఫువాళ్ళకీ దక్షిణంవేపు రెండు గదులిచ్చారు విడిగా. పెళ్ళికొడుకు తల్లి కూడా మధ్యాహ్నం బండికి వెళ్ళిపోయింది. వదినా, అక్కా శోభనం అయ్యాక వధూవరుల్ని తీసికెళ్ళాలని వాసుతోపాటు వుండిపోయారు.

మధ్యాహ్నం పడుకున్నవాడు చీకటి చీకటిపడి పక్షు లరుస్తోంటే లేచాడు తృళ్ళిపడుతూ. రాత్రవుతోందో, తెల్లవారుతోందో అర్థంకాలేదు కాస్సేపు. లేచి మొహం కడుక్కుని బట్టలు వేసుకున్నాడు.

పద్మ వచ్చింది లోపలికి— "లేచావా?" అంటూ.

పెళ్ళికూతురు పినతండ్రి కొడుకు — పధ్నాలుగేళ్ళవాడు — "బావగారు లేచారాండీ?" అంటూ వచ్చాడు.

"కాస్సేపలా తిరిగివద్దాం" అన్నాడు వాసు.

బావమరుదులిద్దరూ బజార్లోకి బయల్దేరారు.

నడుస్తున్నాడేగాని వాసు మనస్సు అవ్యక్తమైన ఆలోచనలతో చిక్కులు పడుతోంది. పెళ్ళి .... అయిపోయింది .... రాత్రి .... ఈ రాత్రికో....?

మాటిమాటికీ వాసు మొహం నిండా నవ్వు మెరుస్తోంది.

బావమరిది బజార్లన్నీ చూపిస్తున్నాడు. ఊరు గురించి తెగ వర్ణిస్తున్నాడు. వాసు ఒక్కటీ వినటంలేదు. "ఊఁ" కొడుతున్నాడు పరధ్యాన్నంగా.

ఎక్కడా ఆగనివాడు పూల దుకాణం ముందు నిలబడి పోయాడు వాసు.

"ఎందుకండీ? పూలు కొందామా?" అన్నాడు బావమరిది రామారావు.

"అబ్బే! వూరికేనే .... పూలెందుకూ?" అంటూ ముందడుగు వేశాడు. నిజంగా వాసుకు. మల్లెపువ్వులూ – గులాబీ పువ్వులూ చెరో గంపా కొనేసి.... రిక్షాలో వేయించుకు తీసికెళ్దామనిపించింది. కానీ .... మొదటిరోజు తను పూలు తీసికెళ్తే ఏం బావుంటుంది? పెళ్ళింట్లో వాళ్ళంతా నవ్వుకుంటారు. రేపట్నుంచీ ఎన్ని రాత్రులు లేవు! ఎన్ని రోజులురావు! వాసు మరో పూలదుకాణందగ్గిర ఆగి ఓ డజను సంపెంగ పువ్వులు కొన్నాడు. సంపెంగ వాసుకి చెప్పలేనంత ఇష్టం. ఇవ్వాళ సుజాత సంపెంగ అంత హాయిగా వుండాలి. తనకి సంపెంగలు ఇష్టమని సుజాతకి చెప్పాలి. వులిక్కిపడ్డట్టు వాచ్ చూశాడు. ఎనిమిదిన్నర.

తొమ్మిదైపోతోందోయ్! వెళ్దాం పద" అంటూ నడకలో వేగం పెంచాడు. పెళ్ళిపందిరి విద్యుద్దీపాలతో వెలిగిపోతోంది. ఇల్లు సందడిగా వుంది. స్నానం, భోజనం లయ్యాయి. వాసు కసలు ఆకలిలేదు. లేదని ఎంతచెప్పినా ఎవ్వరూ వినలేదు. పది నిముషాలు బ్రతిమాలించుకుని పాలన్నం తినటానికి ఒప్పుకున్నాడు. పాలల్లో పంచదార వేసుకుని పరమాన్నం తిన్నట్టు తిన్నాడు. జానకీ, పద్మా వాసుని వదిలేసి పెళ్ళికూతురి దగ్గిరికి వెళ్ళిపోయారు. సాయంత్రంనుంచీ బలవంతంగా ఆపివుంచుకున్న వూహాలు పూపరిమళంలా మనోహరంగా ఆవరించుకున్నాయి వాసుని. వక్కపొడిలో దొరికే తియ్యటి పలుకులు ఏరుకుతింటూ ఒక్కడూ గదిలో కూర్చున్నాడు.

ఈసరికి గది సర్దటం అయివుంటుంది. పట్టు దిళ్ళూ — పరుపూ తెల్లటి దుప్పట్లూ—మల్లెపువ్వుల దండలూ — అగరొత్తులలోంచి వయ్యారంగా లేచే సువాసనలూ — పాలూ — పళ్ళూ — ఏమో! ఇంకేమిటో? చూడాలి మరి — వదిన ఎలా అలంకరిస్తోందో!

పెళ్ళి ముహూర్తం పెట్టుకున్న దగ్గిర్నుంచీ జానకి మరిదితో ఎన్నోసార్లు హాస్యమాడింది— "ఇదిగో టైలర్ దగ్గిరికివెళ్ళి జాకెట్లు తెచ్చిపెట్టమంటే వినలేదుకదూ? సరేలే జ్ఞాపకం వుంచుకో."

"ఏం! ఏం చేస్తావు?"

"నా అవసరం వచ్చినప్పుడు చెప్తా."

"నీ అవసరం నా కెప్పుడూ రాదు."

"అదే చూద్దాం. రేపు అబ్బాయిగారికి శోభనాలూ అవీ అయ్యేప్పుడు నేను పట్టించుకోకపోతే ఏదీ అవదు. వాళ్ళతో దెబ్బలాడి నీకాక్కవలసినట్టు మీ ఆవిణ్ణి ఎవరు ముస్తాబు చేస్తారో చూద్దాం!"

వాసు నవ్వుకున్నాడు. వదిన చెప్పినట్లు చేసిందంతా ఇవ్వాళ కనపడాలి మరి. ఎంత బ్రహ్మాండంగా ముస్తాబు చేసేస్తోందో చూస్తాడుగా!

సుజాత పూలజడ కుట్టించుకుంటూ వుంటుందేమో .... ఇప్పుడు. మెడ నొప్పిపెట్టి తనని తిట్టుకుంటోందేమో! నిజంగా అలాగే అయితే గడ్డం పట్టుకుని చెప్పాలనిపిస్తోంది—"సుజా!.... ఈ ఒక్క రోజుకి నువ్వు నాకోసం విసుక్కోకూడదూ? జన్మలో .. మన కిలాంటి రాత్రి ఎప్పుడు వస్తుంది చెప్పు?" అని బుజ్జగించి చెప్పగలడు. ఒప్పించగలడు.

అయినా సుజాత అంత మనసులేని మనిషేంకాదు. రాత్రి పెళ్ళిలో నవ్వుతూ.... తన కళ్ళకి దొరకకుండా తప్పించుకుంటూ.... తనకి తెలీదా? గదిలో అడుగుపెట్టగానే గదికి నాలుగువేపులా - ఎక్కడెక్కడ గుమ్మా లున్నాయో - కిటికీ లున్నాయో చూడాలి. ఎవరు నవ్వుకున్నా సరే. వరసగా అన్నీ మూసెయ్యాలి. తనేమీ ఎరగనట్లు గాఢంగా నిద్రపోతు న్నట్టు పడుకోవాలి. సుజా ఏం చేస్తుందో! అసలే సిగ్గు. పాపం కొత్త! కంగారుపడిపోతుంది. ఇక్కడికొచ్చి నిద్రపోతున్నా డేమిటని చిరాకు పడిపోతుంది. పంతం కలదయితే పెంకిగా అలాగే తలుపులు కావలించు కుని నించుంటుంది. కొంచెం అమాయకురాలయితే మాత్రం సుకుమా రంగా వచ్చి చెంపలు తాకుతుంది. సుజా ముందు మాట్లాడుతుందో లేదో చూడాలి.

వాసు ఒళ్ళు పులకరించింది.

అసలు పెళ్ళి దగ్గిర్నుంచీ శోభనం రాత్రి గురించే కలలు కంటు న్నాడు వాసు. పెళ్ళి పదిమందిమధ్యా బట్టబయలుగా ఎలాగో అయి పోతుంది. పంతుళ్లేం చెప్తే అదే చెయ్యాలి. ఆశవాళ్ళంతా గుమిగూడు తారు. ఊపిరి సలపనివ్వరు. మనసూరుకోక పెళ్ళికూతుర్ని చూస్తే వదిన గారి లాంటివాళ్ళు టక్కున పట్టేసి వేళాకోళాలతో కాల్చుకుతింటారు. ప్రాణానికి సుఖం వుండదు. స్వేచ్ఛఉండదు. శోభనంరాత్రి అలాక్కాదు. కావలసినంత ఏకాంతం. సుజా ఒక్కతే అందంగా మెరిసిపోతూ పిచ్చె క్కించేలా వుంటుంది. ఎవరో చూస్తారనీ—నవ్వుతారనీ జంకు ఉండదు. ఇద్దరూ ఎంతో సన్నిహితంగా కూర్చుని .. తనివితీరా మాసుకుంటూ ...

స్వర్గంలో క్షణంలా గడిపెయ్యొచ్చు అనుకున్నాడు; గానీ, పెళ్ళి తతంగం కూడా సరదాగానే గడిచింది వాసుకి. పక్కపక్కన పీటలమీద కూర్చోటం—తలంబ్రాలు పోసుకోవటం— మంగళసూత్రాలు కడుతోంటే బాహ్యస్మృతి లేనంత అనుభూతి కల్గడం — కొత్త కుండలో వుంగరాలు వెదకటం— మట్టి తవ్వి నవధాన్యాలు పాతటం— అడుగడుగునా .... ఆనందంగానే గడిచింది. సుజాకూడా వుత్సాహంగా వుంది.

"వాసూ! నిద్రపోతున్నావా?" పద్మ వచ్చింది గదిలోకి.

తృళ్ళిపడి తల ఎత్తాడు వాసు– టైం చూశాడు– పదిన్నర– అబ్బా!

"అదేమిటి కుర్చీలో నిద్ర? పడుకుంటే మంచంమీద పడుకో."

"ఉహూఁ! వూరికే అలా కూర్చున్నా!"

"ఎందుకూ?" పది దాటిపోయింది. పడుకో."

అయోమయంగా చూశాడు వాసు. ఇక్కడ పడుకోవటం ఏమిటి? జానకి కూడా వచ్చింది లోపలికి. విసనకర్ర దూరంగా గిరవాటెట్టింది. తలుపులు బాగా దగ్గిరికి వేసింది. కోపంగా వున్నట్టు మొహం ముడుచుకుంది. వాసు కొంచెం నవ్వుతూ వదినగారికేసి చూశాడు.

జానకి కోపంగానే నవ్వుతూ– "పాపం మరిదిగారిని చూస్తే జాలేస్తోంది— నిజంగానే....ప్రాణం వుసూరు మంటోంది" అంది నిరాశగా.

వాసు గుండెలు దడదడా కొట్టుకున్నాయి జానకి మాటలు లక్ష్యపెట్టనట్టు లేచి ఒళ్ళు విరుచుకున్నాడు.

పద్మ వచ్చి జానకి పక్కన కూర్చుంది — వీళ్ళ కింత బుద్ధి లేదేం?" అంది.

"నెమ్మదిగా అంటావా? వాసుకి కోపం వచ్చినాసరే అత్తగార్నంటున్నానని.... బొత్తిగా మొద్దు మనుషులు.... ఉత్త గాడిదలు ...."

"ఎందుకొదినా జంతుజాలాన్ని గుర్తు చేసుకుంటున్నావు?" నవ్వాడు వాసు.

"ఇలాంటి వాళ్ళని చూస్తే ఇంకేం గుర్తువస్తాయి? మంచీ చెడ్డా చూసుకుని మరీ ముహూర్తం పెట్టుకోవద్దు? తల వాచేలా చివాట్లు పెట్టి వచ్చాను. పెళ్ళికూతురు తల్లీ— మేనత్తా నోరెత్తితేనా? పెళ్ళికూతురు ముంగిలా కూర్చుంది."

"పాపం ఆ పిల్లేం చేస్తుంది?" పద్మ జాలిపడింది.

"ఏం? ఏమైందనలూ?" వాసు వుండబట్టలేకపోయాడు. ఏవేవో రీతులూ రివాజులూ—అంటూ ఈ ఆడమేళం దెబ్బలాడుకుని రసాభాస చెయ్యరు కదా?

"ఇంకేమవ్వాలి? మీ ఆవిడ చాపా— చెంబూ పట్టుకుని వాకిట్లో కూర్చుంది."

అదిరిపడ్డాడు వాసు. జానకికేసి తీక్షణంగా చూశాడు. హాస్యానికైనా వేళాపాళా వుండాలా?

"అంతా బాగానే చూసి పెట్టుకున్నారట ముహూర్తం! ఎందుకో ఇలా అయిందిట. అసలు పెళ్ళికూతురికి నెలే కాదుట. మరెందుకైందో చిత్రం!" జానకి కోపంగానే చేతులు ఝాడిస్తోంది.

వాసు తెల్లబోతున్నట్లు పద్మకేసి చూశాడు. పద్మకూడా నిరుత్సాహంగా వుంది—"మనంకూడా ఆలోచించలేదు వదినా! లగ్నం పెట్టుకున్నప్పుడే ఈ సంగతి బాగా తెలుసుకోవాల్సింది."

"చాల్లే సిగ్గులేదు. ఆ యింగితం వాళ్ళకి వుండాలిగానీ.... అంత బట్ట విప్పుకుంటామా?...."

తర్వాత వాసుకి ఒక్క మాటకూడా తల కెక్కలేదు. మనసంతా శూన్యం....శూన్యం అయిపోయింది. స్థాణువులా కూర్చున్నాడు.

జానకీ పద్మా చాలా మాట్లాడుకున్నారు.

"నాలుగోనాడు స్నానం అయ్యాక పెళ్ళికూతుర్ని తీసుకుపోదామా అంటే, ఆ పిల్ల ఏడుపు మొహం పెట్టింది. ఎప్పుడైనా సరే శోభనం

పుట్టింట్లోనే చెయ్యాలిట. పెద్ద పిల్లకి అత్తారింట్లో చేస్తే అచ్చిరాలేదట; పెద్దవాళ్ళు తా పట్టుదలగా చేస్తోంటే కాదనటం ఎలాగా ?"

"అదికాదు వదినా! మనిద్దరం రేపు వెళ్ళిపోదాం. వాసు వుంటాడు. తర్వాత వాళ్ళిద్దరూ వస్తారు."

"ఏం వాసూ? నువ్వుండిపో."

"ఎన్నాళ్ళుండాలి? " అన్నాడు వాసు పిచ్చి చూపులుచూస్తూ.

జానకి కొంచెం నవ్వి — "ఛీ! ఇల్లాంటి విషయాలేం మాట్లాడ లేం బాబూ! ఐదారు రోజులకిగానీ ఆ పిల్లని గదిలోకి పంపరుట. అవును మరి. తర్వాత మూడురోజులుండి — యిద్దరూ రండి."

వాసు తల అడ్డంగా తిప్పాడు— ఇక్కడ ఐదారు రోజులవరకూ పడిగాపులు పడివుండటం .... ఎందుకనీ? ... శోభనం కోసమా? .... అప్పుడు దాని విలువేముంది? అచ్చటకైనా ముచ్చటకైనా సమయమూ సందర్భమూ వుండాలి. గదిలోకి పంపిస్తారని తను ఇక్కడే వుండి పోవటం.... ఛీ! అంతకన్న సిగ్గుచేటేం వుంది? "వూహుఁ! నేను వుండను."

"మరి పెళ్ళికూతుర్ని తీసికెళ్ళకుండా అందరం వెళ్ళిపోతే ఎలాగ ?"

"ఏమో ! నాకు తెలీదు."

"బావుంది. నామీద ఏమిటి నీ కోపం ?" నవ్వింది జానకి.

మళ్ళా వదినా ఆడబిడ్డలు తర్జన భర్జనలు పడ్డారు.

ఆఖరికో నిర్ణయం చేశారు— "ఇప్పుడందరం వెళ్ళిపోదాం. నెల లోపులో వచ్చి శోభనం చేసుకుని పెళ్ళికూతుర్ని తీసికెళ్దాం."

"ఈ పిల్లకి నెలలు సరిగ్గా రావుట అప్పుడు మళ్ళా చెంబూ—తాపా....." అంటూ నవ్వింది పద్మ.

"బాగా చెప్పావ్. అలాంటి వాళ్ళే వీళ్ళు ఏం వాసూ? అలా చేద్దామా? నెల్లోపల వచ్చి."

"మీ కెలా బావుంటే అలా చెయ్యండి."

"అయితే తెల్లారగట్ట బండి వుంది మనకి. పోదాం. ఒక్క పూట కూడా వుండకూడదు."

"పోనీలే వదినా! వాళ్ళు వింటే బావుండదు" అంది పద్మ కొంచెం మొహమాటంగా.

"చాల్లే! వాళ్ళ బాగుకి మన బాగు పడిపోయింది కాదు" చేతులు తిప్పింది జానకి వెటకారంగా.

జానకి కోపం కొద్దీ ఆడపెళ్ళివాళ్ళని నానాతిట్లూ తిట్టిందే గానీ సంబంధం కుదుర్చుకొనేముందు ఆడపెళ్ళివారి చెయ్యే పైమాటగా వుంది.

సుజాతకి తండ్రిలేడు. మేనమామ ఆస్తి వ్యవహారాలు చూసు న్నాడు. సావిత్రి పెద్దది, సుజాత చిన్నది. మొగపిల్లల్లేరు. తండ్రి వుండే రోజుల్లో జమిందారుల్లా బ్రతికిన సంసారం. ఇప్పటికీ ఆస్తి వుంది. పెద్ద డాబాయిల్లు వుంది. ఆ స్తి అంతా అక్క చెల్లెళ్ళకే— సావిత్రికిక ఆ స్తితో ఏం పని? తిండీ బట్టా చాలు. అంతా సుజాతకే.

వాసు తరఫు వాళ్లు పెళ్ళికూతురికి చెందబోయే ఆస్తిని గురించి ఆశ పడలేదనటానికి వీల్లేదు. ఉన్నవాళ్ళు పిల్లనిస్తామంటే చేదా? నొప్పా? వాసుమాత్రం నిజంగా పెళ్లానికి రాబోయే ఆస్తికోసమే అమ్ముడు పోలేదు. సుజాతని చూశాడు. చాలా నచ్చింది. తన భార్యగా వూహించు కున్నాడు. పొందికగా యిమిడింది. సుజాత చదువుకుంటోంది. అది ఇంకా నచ్చింది వాసుకి.

సుజాత మేనమామ ఎవరెవరి ద్వారానో వాసు వాళ్ళ సంబంధం గురించి విన్నాడు; వాసు గురించి విన్నాడు. చాలా మంచివాడని తేల్చు కున్నాడు. చెడిపోవటానికి ఎన్నో అవకాశాలున్న మొగవాళ్లు చెడిపో

కుండా వుండటం ఓ గొప్ప ప్రత్యేకత. వాసుకి దుర్వ్యసనా లేమీ లేవు. తెలివైనవాడు. బాగా చదువుకున్నాడు. మంచి వుద్యోగం చేసున్నాడు. ఆరోగ్యంగా అందంగా వుంటాడు. ఆ స్తితో వచ్చే ఆడపిల్లని స్వీకరించే అర్హతా, యోగ్యతా వాసుదేవరావుకి వున్నాయనుకున్నాడు సుజాత మేనమామ. వరుడు మంచివాడు దొరికినందుకు ఆడపెళ్ళివాళ్ళుకూడా చాలా సంతోషించారు.

పెళ్ళి అంతా ఆటలా అయిందిగానీ ఎక్కడా ఎవ్వరూ ఏమీ అనుకోలేదు. పెళ్ళివారు వియ్యాలవారిని కానుకలతో ముంచెత్తారు. పెళ్ళికొడుకు కుటుంబంలో అందరికీ ఖరీదైన బట్టలు పెట్టారు. పెళ్ళికొడుకు లాంఛనాలు సరేసరి. అడుక్కో అచ్చటా-మాటకో ముచ్చటా జరిపారు. వియ్యాలవారు తమ స్థితిగతులకు సరిపోరన్న భావం ఎక్కడా కన్పడనివ్వలేదు. గౌరవాలతో, సత్కారాలతో వుక్కిరి బిక్కిరి చేశారు.

ఇదంతా ఓ ఎత్తూ—సుజాతతో మొదటిరాత్రి ఒక్కటీ ఓ ఎత్తూ అనుకున్నాడు వాసు. వాసు దృష్టి ఏ బహుమతులమీదా లేదు! ఏ భోగభాగ్యాలమీదా లేదు.

కానీ....వాసు నిరీక్షణ....వ్యర్థం...వ్యర్థం .... అయిపోయింది. పద్మా—జానకీ మాట్లాడుకుంటూ - మాట్లాడుకుంటూనే నిద్రపోయారు. లైటు తీసేసి వాసు ఒక్కడూ చీకట్లో కూర్చున్నాడు.

శోభనం రాత్రంతా యిలా తల్లక్రిందులైనా తనకి పిచ్చి ఎక్కలేదేం? ఇంత నిర్వికారంగా - ఇంత నిర్లిప్తంగా కూర్చున్నాడేం? ఎలాంటి షాక్‌నైనా తట్టుకునే శక్తి వుందన్నమాట తనకి. ఎందుకీ శక్తి? చాతకాని వేదాంతం మాట్లాడుకున్నట్టుంది. నిజంగా దేవుడున్నాడా? తనేం పాపం చేశాడని ఇంత వుత్సాహభంగం కల్గించాడు?

ఎక్కడినుంచో జామపండు సువాసన.... ఉన్నట్టుండి .... వెలగపండు వాసన సంపెంగలు ...సంపెగలు .... వాసు వేసుకుంధామును

కున్న సిల్కులాల్చీ జేబులోంచి .... సంపెంగలు గుబాళిస్తున్నాయి. ఇలాంటి పరిమళాలు ఆఘ్రాణిస్తూ అయినా దేవుడున్నాడని నమ్మలేమా?

వాసు తలగడలో మొహం ఒత్తుకుని తనని తను మభ్యపెట్టుకుంటూ పడుకున్నాడు—గాలి చాలకుండా పోయినట్టు బాధపడుతూ పక్కమీద దొర్లుతూ.... నిట్టూరుస్తూ....

ఎప్పుడో తెల్లవారఝామున నిద్రపట్టేసరికి – "వాసూ! వాసూ!" అంటూ లేపేసింది పద్మ—"లే! లేచి మొహం కడుక్కో — టాక్సీ వచ్చేసింది" అంటూ హడావుడిగా వెళ్ళిపోయింది.

వాసుకేం తోచలేదు. వెళ్ళిపోవడమేనా?

టిఫెన్లూ, కాఫీలు వచ్చాయి గదిలోకి. వాసు ఏమీ తీసుకోలేదు. పెళ్ళింట్లో ఎవ్వరితోటీ మాట్లాడలేదు. టాక్సీ కదిలేముందు మాత్రం బావమరిదికోసం వెదికాడు. నిద్రపోతున్నాడేమో! ఎక్కడా కన్పించలేదు.

వెనక్కి చూడకుండా కూర్చున్నాడు. రైలు చాలాదూరం వెళ్ళిపోయాక గానీ వాసుకి చైతన్యం రాలేదు. బెర్తుమీద పక్క వేసుకుని పడుకున్నాడు.

తను దోషిలా పారిపోతున్నట్టు సిగ్గు ముంచుకొచ్చింది. ఈ బాధంతా తనకేగాని సుజాకి వుండదా? నలుగురిలో నవ్వుల పాలయిపోయినందుకు ఎంత సిగ్గుపడిపోయిందో ఎవరికి తెలుసు? ఒక్కసారయినా ఆలోచించాడా?

నిజంగానే....వాళ్ళు అన్నీ సవ్యంగా చూసుకునే లగ్నం పెట్టారేమో! ఇలా రసాభాస అవటంమాత్రం బావుంటుందా? అనుభవించే వాళ్ళకి అదృష్టం లేకపోతే అన్నీ అస్తవ్యస్తం అయిపోతాయి. జీవితం సాఫీగా సాగిపోతుందో—ఎదురు తిరిగి నిల్చుంటుందో ఎవరికి తెలుసు? సహించాలి, సహించాలి.

తను మరీ పశువులా ప్రవర్తించాడు. ఒక్కరోజువుండి సుజాతతో మాట్లాడి — వెళ్తానని చెప్పివస్తే ఎంత మంచితనంగా వుండేది! గదిలోకి పంపించలేదని.... ఇలా బయల్దేరి వెళ్ళిపోవటం ఎంత జుగుప్సాకరంగా వుంది!.... సుజా శరీరం ఒక్కటేనా తను కాంక్షించింది? అభిమానంగల ఆడది అయితే తనని మూర్ఖుడిగా—స్వార్థపరుడిగా ఆలోచించి బాధపడదా?

వెయ్యిపూజలు చేసుకున్న పెళ్ళి అయింది. అప్సరసలాంటి భార్య దొరికింది. ఇవ్వాళ కాకపోతే ... రేపు .... రేపనుకుంటే మాత్రం యీ సంతోషం లేదా? తనే మూర్ఖుడు. కనీసం భార్యతో మాట్లాడాలనికూడా ప్రయత్నించకుండా తన దారిన తను వచ్చేశాడు.

ఆత్మనింద వాసునెంతో సేద దీర్చింది.

• • •

ఇంటికి వెళ్ళినరోజు రాత్రే సుజాత పేర వుత్తరం రాశాడు కూడాను. మొట్టమొదట తను చెప్పకుండా బయలుదేరి వచ్చినందుకు క్షమాపణ కోరాడు శోభనంరాత్రి గురించి తనెంత వూహించాడో — అవన్నీ గాలిలో కొట్టుకుపోతోంటే ఎంత పిచ్చివాడయ్యాడో వర్ణించాడు. ఆ నిరాశలో తనేమీ ఆలోచించలేకపోయానని — అసలా సంఘటన జరగలేదని మర్చిపొమ్మనీ బుజ్జగించాడు. అసలు సుజాతని పెళ్ళి చేసుకోటానికి తనెందుకు ఒప్పుకున్నాడో — పెళ్ళి అయిన దగ్గర్నుంచి తన మనస్సంతా ఎలా అవుతుందో విప్పి చెప్పాడు. పెళ్ళి వేడుకల్లో సుజా ఎంత అందంగా వుందో—కొత్త కుండలో వుంగరాలు, మూడుసార్లూ సుజాతకే దొంకటంలో రహస్యం ఏమిటో బయట పెట్టేశాడు — "సుజా? నన్ను అపార్థం చేసుకోవద్దు. నా తొందరపాటుకి నేను చాలా బాధపడుతున్నాను. మనం యిద్దరం ఏకాంతంగా, స్వేచ్ఛగా మాట్లాడుకొనే మధురక్షణాలకోసం వెయ్యి కన్నులతో నిరీక్షిస్తున్నాను — "నీ వాసు" అని వుత్తరం ముగించాడు తృప్తిగా.

అప్పట్నుంచీ రోజూ పోస్టుకోసం ఎదురు చూడడం ఒక్కటే. అది ప్రత్యేకమైనపని అయింది దినచర్యలో. రోజూ దయ్యంలా కన్పించకుండాపోయే పోస్టుమాన్ దేవుడిలా ప్రత్యక్షమయ్యాడు వారం రోజులకి.

సుజాత జవాబు వ్రాసింది. అది అచ్చం జవాబులాగే వుంది.

"ప్రియమైన వాసుదేవరావుగారికి

నమస్కరిస్తూ.......

మిమ్మల్నెలా సంబోధించాలో నాకు తెలియదు. మీరు ఎంతో ప్రేమతో, అభిమానంతో రాశారు వుత్తరం. నేనలా రాయగలనో లేదో అని భయంగా వుంది. మీరు వెళ్ళిపోయినందుకు నేను మీ గురించి చెడ్డగా ఏమీ అనుకోలేదు. నా గురించే మీరు ఏమైనా అనుకుంటారని భయపడ్డాను. నాతో మాట్లాడే అవకాశంలేక మీరు వెళ్ళిపోయారు. అందులో తప్పేముంది? పెద్దవాళ్ళంతా ఏదో మాట్లాడుకుని నిర్ణయించుకున్నారు కదా!

కాలేజీలు తెరిచారు. నేను సెకండియర్ పాసయ్యానని మీకు తెలుసుకదా? మరి మీకు రాస్తే సంతోషిస్తారని రాస్తున్నాను. ఇక ఆఖరి సంవత్సరం వుంది. మళ్లా కాలేజి, చదువూ, అదో ప్రపంచంలా అవుతుంది. నేను వెంటనే జవాబు రాయలేకపోయాను. మన్నించండి.

మీ "సుజాత"

చాలా అసంతృప్తి కలిగించిందా ఉత్తరం వాసుకి. చదివిందే పది సార్లు చదివాడు. సుజాత ప్రేమగానే రాసింది. భక్తిగానే రాసింది. కాదనటం లేదు. కానీ క్లుప్తంగా.... ఇంత పొడి .... పొడిగా .... ఎవరో చిన్నపిల్లలు రాసినట్టు ఎవరో పరాయివాళ్ళకు రాసినట్టు ...ఏమీ నచ్చలేదు వాసుకి. బి. ఏ. చదువుతోన్న అమ్మాయి — కొత్త పెళ్ళికూతురు — తన భర్తకి రాసుకోవాల్సిందేమీ లేదా? ఆ శోభనంరాత్రి .... తను ఎలా

ముస్తాబవుదా మనుకుందో....ఎలా మాట్లాడుదామనుకుందో .. తీరా అంతా తారుమారైతే....ఎంతదిగులు పడిపోయిందో ఎంత ఏడ్చిందో...అవంతా విపులంగా....ఎందుకు రాయకూడదు? తనేం పరాయివాడా? ఇంకెవరికి చెప్తుంది? మనస్సంతా విప్పిచెప్పుకుంటే ఎంత హాయిగా వుంటుంది.

అయినా.... పెళ్ళంటే అయింది. మెడలో పుస్తె పడిపడిందిగానీ, అంతకుమించి యిద్దరికీ ఏం పరిచయం వుంది ? ఒక్కమాట కూడా మాట్లాడుకోలేదు. ఇంతకన్నా ఆత్మీయత ఎలా వస్తుంది? సుజాతని తప్పు పట్టి తను బాధపడటంలో అర్థంలేదు. అదే సహనం !

ఆ రాత్రే మరో వుత్తరం రాశాడు వాసు — సుజాతకి. జవాబు కోసం ఎదురు చూడకుండానే మూడోది రాశాడు. రోజూ ఓ వుత్తరం రాయాలనిపిస్తోంది. రాస్తోనే వున్నాడు.

అసలు శోభనం అవకుండా వుంటేనే బావుంది. ఇంకా ముందు ముందు వుందనుకుంటే.... దానికోసం కలలు కంటోంటే ... హాయిగా వుంది. అనుభవంకన్నా నిరీక్షణే మధురంగా వుంటుందేమో! అందుకే పూర్వం పెళ్ళికీ శోభనానికీ విధిగా కొంత వ్యవధి వుంచేవారట. అది వధూవరుల్ని మానసికంగా సన్నిహితం చేస్తుంది. విరహ శృంగారంలో మాధుర్యం చవిచూపిస్తుంది. మనసులు పండించి_అనుభవాలను అనురాగమయం చేస్తుంది.

వధూవరులు దూరంగా వుంటూ, వుత్తరాలు రాసుకోవటంలో ఆనందం వాసుకి కొత్తగా వుంది. సుజా వుత్తరాలలో చైతన్యం వుంటే వాసుకి యింకా సంతోషం కలిగేది.

* * *

పెళ్ళి అయి పద్ధెనిమిది రోజులు దాటింది.

ముహూర్తం చూపించి శోభనానికి ఏర్పాటు చేయాలని హడావిడి పడింది వాసు తల్లి. మర్నాడే వియ్యాలవారి దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది_

సుజాతకి వారం రోజులనుంచీ జ్వరం వస్తోందట. ఓ నెల్లాళ్ళనుంచీ ఆపిల్లకి నలతగానే వుంటోందిట. కాలెజీకికూడా వెళ్ళటంలేదట. విశ్రాంతి అవసరం అని డాక్టరుగా రన్నారట — అల్లుడుగారి యోగ క్షేమాలు తెలియజెయ్యాలిట — అదీ విషయం.

"అయ్యో! పిల్ల ఎలా వుందో!" అంది వాసు తల్లి.

"సింగినాదం. ఓ పిసరు వేడిచేస్తే చాలు– వాళ్ళదంతా అబద్ధం. మళ్ళా మరిదినోట్లో పచ్చి వెలక్కాయ పడింది" అంది జానకి నవ్వుతూనే.

అత్తగారు రాయించిన వుత్తరం వాసుకూడా చూశాడు. ఇంట్లో వాళ్ళ మాటలూ విన్నాడు. మాట్లాడకుండా కూర్చున్నాడు. ఆరోగ్యం తర్వాతే ఏదైనా, బాధపడటంలో అర్థమేముంది? "చదువులో పడి నిర్లక్ష్యం చెయ్యకు. నీ ఒంట్లో ఎలా వుందో ఎప్పటికప్పుడు రాస్తూండు" అని వుత్తరం రాశాడు సుజాతకి.

సుజాత జవాబులు ఇచ్చినా, ఇవ్వకపోయినా వాసు పట్టించుకోడు. ఏ క్షణానికి తన మనస్సెలా వుంటుందో డైరీ రాసినట్టు రాసాడు. ఒక్కోరోజు అర్ధరాత్రిలేచి కూర్చుని తెల్లవార్లూ రాస్తూ వుంటాడు. కొత్త సంగతులేమీ తోచనప్పుడు రాసిందే రాస్తాడు. తన కోరికలన్నీ వెల్లడిసాడు. తామిద్దరూ ఎలాగో అయిపోవాలంటాడు. ప్రేమా– అనురాగం – కౌగిలీ ముద్దులూ లేకుండా కలం పరిగెత్తదు. ఏది రాయటానికీ సిగ్గుపెయ్యదు. సుజా జవాబులెందుకు రాయదని ఆలోచించడం కూడా మానేశాడు.

వాసు వూహలన్నీ మూడోనెలలో రాజ్యం చేయబోతున్నాయి.

అప్పుడు వాసు ఇంట్లో లేడు. వాసు వచ్చేసరికి – పిలక పంతులు పంచాంగంవిప్పి వీభూతికట్లు రాలిపడేలా నుదురు చిట్లిస్తూ తిథి నక్షత్రాలు చూస్తున్నాడు. పంతులు సాక్షాత్తూ బ్రహ్మదేవుడిలా కనపడ్డాడు వాసుకి. ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ గదిలోకి వెళ్ళిపోయాడు. జానకి కాఫీ తెచ్చిచ్చింది. పంతులు తాగి గొంతు సర్దుకున్నాడు.

"అమ్మా! ఆషాఢం వల్ల కాదుగదా? అందరికీ తెలిసిందే!....

శ్రావణం చుక్క మూఢమి. తెల్లవారుఝామున చుక్క పొడుస్తుంది — చూశారూ? అది మూఢానపడింది. ఆవటా.... అదీ వల్లకాదు .... భాద్రపదం.... శూన్యం — లాభంలేదు. వరసగా మూడునెలలు గడ్డురోజులు తల్లీ! శుభకార్యాలమాట ఎత్తనే కూడదు."

వాసుకి మొదటేమీ అర్థంకాలేదు పంతులేవో మంత్రాలు చదువు తున్నా డనుకున్నాడు, వినగా.... వినగా అవి మంత్రాల్లాలేవు. ఏమిటో.... శూన్యం అంటున్నాడు. మూఢమి అంటున్నాడు.... శుభకార్యం అంటు న్నాడు.... వల్లకాదంటున్నాడు.

అదిరే గుండెలతో కాలు నిలవక బయటికి రాలేక బోనులో సింహంలాగ కట్టిపడేసినట్టు నించున్నాడు.

జానకి మాటలు వినిపించాయి. అత్తగారితో అంటోంది —"మీ చాదసంగానీ — పెళ్ళి అవనే అయింది. ఇక మొగుడూ పెళ్ళాలకి మంచేవిటి?"

"అమ్మో! అలా అనకు, అసలు శోభనం ముహూర్తమే మంచి దుండాలి లేకపోతే కీడుకొడుతుందంటారు. ఇప్పుడేం మించిపోయింది? అయిన ఆలశ్యం ఎలాగూ అయింది. మూడు నెలలు ఎన్నాళ్ళలో గడుస్తాయి? ఓ అర్నెల్లపాటు పెళ్ళే అవలేదనుకుంటే సరి."

వాసు తల గిర్రున తిరిగింది. పట్టరానంత కోపం వచ్చింది. "ఏం? మూఢాలో — శోభనం చేసుకుంటే ఏమౌతుంది? ఏమీ కాదని నేను ఛాలెంజ్ చేస్తాను" అని పంతులుమీదికి యుద్ధానికి వెళ్ళాలనిపించింది.

తనని అడగ్గానే —"నా కిల్లాంటి పిచ్చి పిచ్చి నమ్మకాలు లేవు" అనేద్దామని నించున్నాడు.

వాసుతో ఎవరూ సంప్రదించలేదు. హాస్యమాడటానికి కూడా జానకికి మనస్సు వొప్పలేదు. అత్తగారితోవాదిస్తోనే వుంది. ఆవిడ ససేమిరా కోడలిమాట వినలేదు. పంతులుకూడా ఆమెకి వంతపాడుతూ కూర్చున్నాడు—"అమ్మా! దుర్ముహూర్తంలో శోభనం చేసుకుంటే బిడ్డలు రాక్షసులౌతారు. దంపతులకు ఆయుఃక్షీణం ..,"

"నీ నెత్తి! నీ పిండాకూడు. నీకు కాఫీ దక్కదు" తిట్టుకున్నాడు వాసు. వాసు తల్లి తృప్తిగా ఐదురూపాయలు తమలపాకుల్లో పెట్టి అందించింది పంతులుకి.

పంతులు లేచి పంచాంగం కట్టకట్టి చంకనెట్టుకుని పిలక ఊగించుకుంటూ వెళ్ళిపోయాడు.

పంతులున్నంతసేపూ కోపం వచ్చిందిగానీ— అతగాడు వెళ్ళిపోయాక ఆడపిల్లలా ఏడ్చెయ్యాలనిపించింది వాసుకి. కొయ్యబారికూర్చున్నాడు గదిలో. జానకి కాఫీయిచ్చి వెళ్ళబోయింది.

"అక్కర్లేదు – తీసుకుపో" అన్నాడు.

"ఏం?" అంది తెల్లబోతూ.

"ఏం లేదు" అన్నాడు చిరాగ్గా. తన వ్యవహారంలో తన కేమీ స్వతంత్రం లేదా? తనతో మాట మాత్రమయినా చెప్పనక్కరలేదా?

వాసు కోపం ఎందుకో పసిగట్టి చెప్పింది జానకి అత్తగారికి.

ఆవిడ ఓ నవ్వు నవ్వింది – "ఒరే వాసూ! రేపు మీ అత్తారికి ఉత్తరం రాయాలి. పంతులుగారు చెప్పిందంతా విన్నావుగా? పోనీ పిల్లగలవాళ్ళు ఒప్పుకుంటారేమో చూద్దాం. వాళ్ళెలాఅంటే అలా చేద్దాం" అంది అనునయంగా—వాళ్ళెలాగూ ఒప్పుకోరన్న ధైర్యంతో.

ఆ ఓదార్పుతో వాసుకి ఒరిగిందేమీ లేదు. ఇల్లాంటి నమ్మకాలు లేనివాళ్ళెవరు? తను కాదనటం వాళ్ళు అవుననటం.... ఛీ! సిగ్గుచేటు. సున్నితంగా జరిగే వ్యవహారాలు సున్నితంగానే జరగాలి – ఎంతకాలమైనా సరే.

ఆ రాత్రి చాలాసేపటివరకూ సుజాకి వుత్తరం రాస్తోనే కూర్చున్నాడు వాసు. వెర్రివెధవలు పెట్టిన పిచ్చి ఆచారాన్ని దుయ్యబట్టాడు. బుర్రలుపెట్టి ఆలోచించకుండా, ఇంగితం లేకుండా గాలికీ–ధూళికీ భయపడిపోయే చచ్చుపీనుగుల్ని తిట్టిపోశాడు. అసలు... ఓ నెలని మంచిదిగానూ ఓ నెలని మహా చెడ్డదిగానూ విడదీసిన పక్షపాతపు వెధవని శాపనార్థాలు పెట్టాడు—"సుజా! ఇదంతా వుత్త బూటకం. నేను బొత్తిగా నమ్మను.

కానీ ఏం చెయ్యను ? మనం ఇద్దరం స్వతంత్రించి నిర్ణయాలు చేసుకొనే సమయం ఇంకా రాలేదు. పెళ్ళికిముందు మన మధ్య ఎంత దూరం ఉందో ఇప్పుడూ అలాగే వుంది. నేను పిరికివాడినై మౌనంగా ఉంటున్నానని అనుకోకు. మనం సుఖపడటానికి పరిసరాలు ఎంతో దోహదం చేయాలి. వీళ్ళందర్నీ నిర్లక్ష్యంచేసి నేను నీ దగ్గరకొచ్చేస్తే – ఆ అనుభవంలో ఎంతో వెలితి వుంటుంది. అది మనల్ని అశాంతిపాలు చేస్తుంది ఇదంతా ఆలోచించే నేను ఈ మూడునెలలూ పెద్దవాళ్ళ నమ్మకాల ప్రకారం పోదామని నిర్ణయించుకున్నాను – నువ్వు నవ్వుతావేమోగానీ విధి క్రూరంగా మనల్ని వేరుచేస్తోంది. చివరికి ఎవరు నెగ్గుతారో చూద్దాం. నిన్ను నా కౌగిట్లో బంధించుకుని .... విధిని వెక్కిరించకపోతానా ? అద్దాలవంటి నీ చెక్కిళ్ళలో....నన్ను నేను చూసుకుంటూ....నీలాలుచిందే నీ కన్నుల్లో ....వాసు కలం .... వినయ విధేయతలతో – వాసు వూహల్ని తర్జుమా చేస్తూ లేడిలా పరుగులు తీసింది.

వాసు కట్టెదుట సుజాత ప్రత్యక్షమైంది.

మందహాసాలు ఒలికిస్తూ – వయ్యారాలు పోతోంది. వాలుచూపులతో వెర్రెక్కించి–కులుకు నడకలతో రెచ్చగొడుతోంది. వాసు అర మోడ్పు కన్నులు ఎర్రటి ఎరుపు తేలాయి. నుదురంతా చెమట పట్టింది. ఊపిరి సెగలు రేగుతోంది. ఏం రాస్తున్నాడో, ఎలా రాస్తున్నాడో అర్థం కాలేదు. అవిరామంగా శ్రమించి అలసిపోయినట్లు కలం ఆపుచేశాడు. అస్తవ్యస్తంగా పడివున్న కాయితాలన్నీ సర్దాడు – వుత్తరం చదువుతోంటే వాసుకే సిగ్గు ముంచుకొచ్చింది. ఇలాంటి వుత్తరం చదివి సుజా ఏమనుకుంటుందో ! చిరాకు పడుతుందేమో ! ఆశ్చర్యపోతుందేమో ! తిట్టిపోస్తుందేమో ! పోనీ అదీ చూద్దాం — "పెళ్ళానికి రాశానుగానీ పరాయివాళ్ళకు రాయలేదు గదా ! నా ఇష్టం. ఇంకా రాస్తాను" — ఆ వుత్తరం మర్నాడే పోస్టు కెళ్ళింది.

వారంరోజులైనా జవాబు రాలేదు. వాసు కుతూహలం దిగులుగా మారింది. సుజాని చికాకు పెట్టినందుకు భయం వేసింది. అభిమా

శుభమూ తెలీని ఒక ఆడపిల్లకి మొగుణ్ణి కదా అనే అధికారంతో అస్తవ్యస్తపు రాతలు రాయటం ఏం సంస్కారం? పశువులా బుద్ధిహీనంగా రాశాడు తను. సుజాత తనని గురించి ఎంతో సున్నితంగా, వున్నతంగా వూహించుకొంటూ వుంటుంది. అదంతా చేజేతులా ధ్వంసం చేశాడు తను. మొరటు మనిషిలా—మూర్ఖుడిలా సాక్షాత్కరించాడు. ఎంత తొందర!

"సుజా! నీకు కోపం వచ్చిందా? నేనంటే అసహ్యం వేసిందా? నన్ను క్షమించవూ? నేను రోజు రోజుకీ పిచ్చివాణ్ణయి పోతున్నాను. ఎప్పుడేం చేస్తానో తెలియటంలేదు. నా ఆలోచన లేవీ నా వశంలో లేవు. ఇంకా ఈ ఎడబాటు కొన్నాళ్ళు సాగితే నేను ప్రాణాలతో వుంటాననే నమ్మకం నాకు లేదు. ఎప్పుడో హఠాత్తుగా నా మృత్యువు- చూడటానికే నువ్వు రావాలి. అప్పుడు నేను నీకేమీ చెప్పలేను. నన్ను చూసి భయపడి దూరంగా వుండిపోకు. మనస్ఫూర్తిగా నన్ను నీ ఒడిలోకి తీసుకొని నీ హృదయానికి హత్తుకో. నా మృత కళేబరంమీద నీ సున్నితమైన పెదవులతో ముద్దులవర్షం కురిపించు. అప్పటికిగానీ నా ఆత్మ శాంతించదు. అది చెట్టూ పుట్టలూ పట్టుకుని తిరుగుతూనే వుంటుంది. నన్ను హఠాత్తుగా మృత్యువు ఎత్తుకుపోతే కడసారిగా నిన్ను కోరే కోరిక ఇది ఒక్కటే."

ఆ ఉత్తరానికి సుజాత వెంటనే జవాబిచ్చింది— "మీ ఉత్తరం చూస్తే నాకు భయం వేసింది. ఏడుపొచ్చింది. ఎందుకలా రాశారు?"— సుజా బిక్కమొహంవేసి అమాయకంగా అడుగుతూ కన్పించింది. వాసు చాలా బాధపడ్డాడు సుజాని అంత కంగారు పెట్టినందుకు అప్పట్నుంచీ- చాలా నిగ్రహంగా—క్లుప్తంగా—ప్రేమపూరితంగా రాయాలని నిర్ణయించుకున్నాడు.

* * *

మూడు నెలలు — దుర్భరంగా—దుస్సహంగా గడిచాయి వాసుకి. కనుచూపుమేరలో ఆశ్వయుజం తొంగిచూస్తోంది రెక్కలు టపటపలాడిస్తూ గరుడపక్షి నిద్ర లేచినట్టు మేల్కొంది వాసు వూహాలోకం.

వారం పదిరోజుల్లో ముహూర్తం పెట్టబోతారనగా సుజాత దగ్గర్నుంచి ఒక ఉత్తరం వచ్చింది వాసుకి.

ఆ ఉత్తరం చదివి నిర్ఘాంతపోయాడు వాసు. తల పది తలల్లాగ గిర్రున తిరిగింది. అసహనంతో వెర్రివాడిలా ఆ ఉత్తరం చించి పారేశాడు.

సుజాత భర్తని ప్రాధేయపడుతూ రాసింది—ఆ సంవత్సరానికిక శోభనం సంగతి ఎత్తవద్దని. తనకి ఆఖరి సంవత్సరం కాలేజీ చదువుకీ ఈ సంసార జీవితానికి సమన్వయం కుదుర్చుకోవటం తనకి సాధ్యం కాదని, దయచేసి తనని అర్థం చేసుకోవటానికి ప్రయత్నించమనీ....

వాసు దీర్ఘంగా నిట్టూర్చాడు.. వ్యధనంతా నిట్టూర్పులా వదిలేశాడు.

వాసు ఇంటికి వచ్చేసరికి పంచాంగం పంతులు సీరియస్‌గా తిధి నక్షత్రాలు చూస్తూ కన్పించేడు.

వాసు గదిలోకి వెళుతూ "వదినా !" అని పిల్చాడు.

జానకి వచ్చింది నవ్వుతూ—"నీ కష్టాలు గట్టెక్కాయిలే వాసూ!" అంది హాస్యంగా.

"గట్టెక్కలేదు. నా నెత్తెక్కాయి" అన్నాడు నవ్వూ, కోపం మేళవించి.

"ఇంకా ఎందుకంత చిరాకూ? ముహూర్తం పెట్టించేస్తుంటేనూ."

"అందుకే పిల్చాను నిన్ను. ఇప్పుడేమీవద్దు. అమ్మకి చెప్పు."

"అదేమిటి ? .... నిజంగానే ?...."

"నిజమే వదినా! సుజాకీ సంవత్సరం ఫైనల్ కదా? తన కిష్టం లేదని రాసింది. ఆలోచిస్తే నాకూ యిష్టంలేదు. ముహూర్తం అదీ వద్దు."

జానకి తెల్లబోతూ వెళ్ళిపోయింది.

"ఏమిట్రా వాసూ?" అంటూ వచ్చింది వాసుతల్లి — "ఇప్పటికే

అర్నెల్లు దాటిపోయింది. చదువు ముందా ? సంసారం ముందా ? ఇదేం తిక్క నీకూ ?"

వాసు బలవంతంగా నవ్వు తెచ్చుకున్నాడు—"ఇప్పుడొద్దులేమ్మా! వేసంకాలం చూద్దాం."

"హవ్వ ! నవ్విపోతా రెవరన్నా! మూడు ముళ్ళూ వేసి చక్కా వచ్చావు. ఈ ఘడియవరకూ పెళ్ళికూతుర్ని గుమ్మంలోకి తీసుకురాలేదు. ఇప్పటికే సిగ్గుతో చస్తున్నాను... ఆ అడ్డుకాస్తా తీరిపోతే .. నిక్షేపంలా"

జానకి అందుకుంది .... ముహూర్తం పెట్టనియ్యి వాసూ ! సుజాతని మన యింటికి తీసుకొచ్చి పంపించేద్దాం. దానికైనా మంచిరోజు వుండాలిగా ?"

"ఉహుం! ఏకంగా ఒక్కసారే వస్తుందిలే. ఇప్పుడేం వద్దు. ఎవరో అనుకుంటారని మన మేం చెయ్యగలం ?" ఖచ్చితంగా చెప్పేశాడు వాసు.

వాసు అన్న కూడా తమ్ముడి పాయంటే మాట్లాడాడు. మొత్తంగా సుజాత పరీక్షలయ్యేవరకూ ఎలాంటి లగ్గాలూ గిగ్గాలు వుండకూడదని కొట్టిపారేశారు.

వాసుకి చాలా గర్వంగా వుంది—సుజా తన సంస్కారాన్ని అర్థం చేసుకుంటుంది. తనని ఇంకా ప్రేమిస్తుంది.

తర్వాత వాసు సుజాతకి తరుచూ వుత్తరాలు రాయటం తగ్గించేశాడు సుజాని డిస్టర్బ్ చెయ్యకూడదని.

• • •

ఆ రాత్రే శోభనం వాసుకి. శోభనం కోసం వాసే కళ్ళు కాయలు కాచేలా నిరీక్షించాడు కాబట్టి, అది వాసు శోభనమే.

వాసుతో జానకి ఒక్కతే వచ్చింది వియ్యాలవారింటికి. రాత్రి శోభనం అనగా ఉదయం బండి దిగారు.

ఇంట్లో చుట్టాలెవ్వరూ లేరు; సుజాత ఒక్కతే వుంది. బండి దిగి జానకి లోపలికి వెళ్ళి తోడికోడల్ని చూసింది.

"బాగున్నావా?" అంది.

నవ్వి ఊరుకుంది సుజాత.

పగలంతా సుజాతని శల్యపరీక్షలు చేస్తోనే వుంది జానకి. సుజాత ఈ కాలపు పిల్లలాలేదు. ఎక్కువగా మాట్లాడదు, నవ్వదు. ముభావంగా తనకేవీ పట్టనట్టు ఉంటుంది. ఎందుకైనా దిగులా? అంటే ఆపిల్ల దిగులు పెట్టుకొనే కారణాలేవీ కన్పించలేదు జానకికి. దిగు లనుకోవటం పొరపాటే. అది ఆ పిల్ల తత్వం. మొగుడూ పెళ్లాలు ఒక్కటైతేసరి. అన్ని దిగుళ్ళూ పోతాయి.

సుజాతకన్నా వాళ్ళక్క సావిత్రి హుషారుగా కనిపించింది జానకికి. సుజాత అంత రూపసి కాదుగాని—అందమయిందే. ఇరవై మూడో నాలుగో ఉంటుంది వయస్సు.

అప్పుడే ఆ పిల్ల అందచందాలన్నీ బూడిదలో పోసిన పన్నీరయి పోయాయి. నాలుగేళ్ళనుంచీ సావిత్రి ముద్దు ముచ్చట్లకి దూరమై పుట్టింటే వుంటోంది. మనిషి మంచిది. కలివిడిగా తిరిగే స్వభావం. కానీ తన శకునం మంచిదికాదని ప్రతి పనికీ దూర దూరంగా వుంటుంది. ఏ పనికీ తనకై తను కలగజేసుకోదు. శుభసమయాలలో తనని చూసుకుని తనే భయపడి దాక్కుంటూ వుంటుంది. సావిత్రి చూపుల్లో దైన్యం అర్థం చేసుకోగలిగే వాళ్ళకి సావిత్రిమీద పుట్టెడు జాలి ముంచుకొస్తుంది. జానకి చీటికీ మాటికీ సావిత్రిని పిలుస్తూ—పలకరిస్తూ ముచ్చట్లాడుతూ గడిపేసిందా పగలంతా.

దీపాలు వెలిగించారు.

రాత్రి అవుతోంది. శోభనం గది సర్దాలన్న ధ్యాసే ఎవ్వరికీ వున్నట్టులేదు ఇంట్లో. కాస్సేపు చూసి సావిత్రి నడిగింది జానకి.

"ఏమో! అమ్మకీ, అత్తయ్యకీ ఏం తెలుస్తుంది? నా చెయ్యి పెట్టడం

ఎందుకని వూరుకున్నాను. సుజా గది వుందిగా? అన్నీ మీరు సర్దండి" అంది సావిత్రి. జానికి వుత్సాహం తెచ్చుకుని సావిత్రిని వెంటబెట్టుకుని *మామూలు గదిని "శోభనం గదేమో" అనుకునేలా* చేసింది.

తర్వాత సుజాతని ముస్తాబు చెయ్యటంలో పడింది. సావిత్రి మల్లెపువ్వులు అందిస్తోంటే జానకి చిలిపిగా మాట్లాడుతూ, జడ కుడుతూ కూర్చుంది— "ఇదిగో అమ్మాయ్! చెల్లెలితో హాస్యం ఆడుతున్నాననుకోకు—ఇంత కష్టపడి పూలజడ కుట్టించుకునే దెందుకనుకున్నావూ? దీనితో ఒక్క దెబ్బ వేశావంటే రేపు ఆ వాత పెళ్ళికొడుకు చెంపమీద మా కందరికీ కనపడాలి."

సావిత్రి ముసిముసి నవ్వులు నవ్వింది. అంతలోనే దిగులుగా చూస్తూ కూర్చుంది. సుజాత కిక్కురుమనలేదు. జవాబు చెప్పలేదు. కనీసం నవ్వు దాచుకుంటోన్న ప్రయత్నమైనా కన్పించలేదు.

జడ కుట్టటం అయ్యాక జానకి శోభనం పెళ్ళికూతురి మొహాన అందంగా తిలకం దిద్దింది. కట్టుకోటానికి అత్తారింటి దగ్గర్నుంచి తెచ్చిన జరీపువ్వుల చీర తీసియిచ్చింది— "ఇది మీ ఆయనే స్వయంగా కొన్నాడు. నీకు నచ్చకపోతే గదిలో కెళ్ళగానే విప్పి అతని మొహాన పారెయ్" అంది.

ఫక్కుమంది సావిత్రి—తప్పుచేసిన దానిలా సిగ్గుపడిపోయింది. సుజా మాట్లాడలేదు. ఎవరివైపూ చూడలేదు. పైటకొంగు పరీక్షచేస్తూ కుర్చీలో కూర్చుంది.

పెద్దపిల్లకి లక్షణంగా వేడుకలన్నీ చేస్తే అచ్చిరాలేదుట. అందుకని పేరంటాళ్ళూ—ఫలదానాలూ—బ్రాహ్మణులూ — మంత్రాలూ — ఏవీ పెట్టుకోలేదుట. జానక్కేం నచ్చలేదు. రుసరుసలాడుతూ వచ్చింది మరిది గదిలోకి. "వీళ్ళంతా వుత్త ఎడ్డిమనుషుల్లా వున్నారు. ఓ సరదా లేదు పాడూ లేదు."

వాసు నవ్వాడు—"పెత్తనం చేద్దామని వచ్చావు. నీ సరదా తీరినట్టే లదు."

"నువ్వూ.... నీ పెళ్లాం బాగానే వున్నారు. నాకెందుకూ మధ్య?"

రాత్రి కెప్పుడో—ఇల్లు మాటు మణిగింది.

జానకి వాసుని శోభనం గది ముందుకు తీసికెళ్ళి—"వెళ్ళి పడుకో, సుజాత వస్తుందిలే. అప్సరసలా ఉంది. చాలా మంచిపిల్ల. జాగ్రత్తగా వుండు" అంటూ పెద్దరికంతో నాలుగుమాటలూ చెప్పి వెళ్ళిపోయింది.

వాసు గుండెలు దడదడా కొట్టుకుంటున్నాయి. ఒళ్ళంతా చెమట పట్టింది. తలుపులు తీసుకుని గదిలో అడుగుపెట్టాడు. ఒక్క చూపులో నాలుగువైపులా చూశాడు. గది చాలా నచ్చింది. అగరువొత్తుల పొగతో సువాసనలతో నిండివుంది. ఒక్కడూ గదిమధ్య నించున్నాడు. కల ఇన్నాళ్ళకి నిజం అయింది.

సుజాతని పెళ్ళిలో చూశాడు. సంవత్సరం కావస్తోంది. క్షణానికో ఘడియకో.... చూస్తాననుకుంటే.... బ్రహ్మానందంగా వుంది.

వాసు మనస్సు మూగపోయింది.

అలలు పోయి ప్రశాంతంగా తేరుకున్న సరస్సులా వుంది.

మబ్బులన్నీ చెదిరి చల్లని వెన్నెలకాసే ఆకాశంలా వుంది. సంవత్సరం క్రిందట వాసు నిరీక్షించిన శోభనంరాత్రికీ ఈ రాత్రికీ యోజనాల వ్యత్యాసం వుంది. ఆనాటి వుద్వేగమూ—తొందరపాటూ ఇప్పుడు లేవు. అది వుత్త కామం. ఇప్పుడు సుజా అంటే అణువణువునా అనురాగమే.

క్షణమో.... ఘడియో.... అనుకుంటూ గంటపైగా గడిపాడు.

లేచి ఫాన్‌వేసి మళ్లా కూర్చున్నాడు. కూర్చోబుద్ధిగాక నెమ్మదిగా పచార్లు సాగించాడు. గోడదగ్గర నుంచుని వరసగా ఫొటోలు చూశాడు—

ఒక ఫొటోలో ఇద్దరమ్మాయిలు. కుడివైపున సుజాత—పదహారేళ్ళ వయస్సుంటుంది. ఎడమవైపు ... వాళ్ళ అక్క — వాసు ఎప్పుడూ చూడలేదు. సావిత్రి గురించి విన్నాడు. పాపం.... దురదృష్టవంతురాలు.

ఇద్దరిలోనూ సుజాత అందంగా వుంది. ఇప్పుడయితే పువ్వుకు వాసన పట్టినట్టు ఆకర్షణ కూడా.

వాసు మందహాసం చిందిస్తూ సుజా ఫోటో చూస్తూ నించున్నాడు. జానకి గంటనుంచీ చెప్తోంది సుజాతకి— "వెళ్ళమ్మా! గదిలోకి వెళ్ళి పడుకో" అని.

"వెళ్తాలెండి" అనటం తప్పితే కదలదు సుజాత.

ఇంట్లో అందరూ నిద్రపోతున్నారు. తనక్కూడా ఆవలింత లొస్తోంటే— "ఇక్కడే నిద్రపోయేలా వున్నావు. మీ ఆయన నన్ను తిడతాడు. నీ యిష్టం మరి?" అంటూ నిద్రకి పడింది జానకి.

సుజాత చాలాసేపు ఒక్కతే కూర్చుంది. చేతులమధ్య చెంపలు కప్పుకుంది. దీర్ఘంగా నిట్టూర్చి లేచి నిలబడింది. నెమ్మదిగా అడుగులు లెక్కపెడుతూ శోభనంగది ముందుకువెళ్ళి గుమ్మందాటి తలుపులు లోపలికి వేసి వెనక్కి తిరిగింది.

గోడమీద ఫొటోలు చూస్తోన్న వాసు తృళ్ళిపడి తల తిప్పాడు. సుజాత తల దించేసుకుంది. వాసు అక్కడే నిలబడిపోయాడు.

సుజా—పూలజడ వేసుకుంది. జరీపువ్వుల చీర కట్టుకుంది— ఒంటినిండా నగలు పెట్టుకుంది. దేవకన్యలా ప్రత్యక్షమైంది.

వాసు బాహ్యస్మృతి కోల్పోయాడు.

కలలోలాగా నడిచాడు.

సుజాత అయస్కాంతంలా వాసుని నిలబడనివ్వకుండా బలంగా ఆకర్షిస్తూ వెర్రివాణ్ణి చేసింది. తన్మయత్వంతో సుజాని గుండెలకి గాఢంగా హత్తుకున్నాడు.

"సుజా" అప్రయత్నంగా అన్నాడు. "ఎన్నాళ్ళ కెన్నాళ్ళకి!" అంతకుమించి మాటలు రాలేదు. ఎంతో చెప్పాలనీ, అవిరామంగా మాట్లాడాలనీ తహతహ లాడుతోంది హృదయం—"సుజా! ఈ రోజుకోసం ఎన్నాళ్ళుగానో నిరీక్షించాం కదూ? నిజం చెప్పనా?.... ఇలాంటి రోజు రాదేమోనని భయపడ్డాను నేను. నవ్వుతావేమో! భగవంతుడు నిర్దయుడు కాడు... సుజా! నీకోసం....నేనెంత తపించానో తెలుసా?" అని చెప్పాలనీ వువ్విళ్ళూరింది మనసు.

వాసుకూడా అనుకున్నంత ధైర్యంగా లేడు. అర్థంకాని సిగ్గూ—జంకూ అడ్డువస్తున్నాయి.

సుజాత తల దించుకుని ప్రతిమలా నిలబడివుంది. వాసు తన్మయంగా చూశాడు - చూసి చూసి అన్నాడు — "సుజా! నువ్వు చాలా అందంగా వున్నావు."

సుజాత తల ఎత్తలేదు.

లేదన్నట్టు తల వూపింది.

"మరి ఎందుకిలా వున్నావు? .... ఒంట్లో బాగాలేదా?"

కాదన్నట్టు చూసింది.

వాసు సుజా పూలజడ చేతుల్లోకి తీసుకుని చూశాడు—

"మాట్లాడకూడదా? నోట్లో ముత్యాలు పెట్టుకు వచ్చావా?"

సుజా నవ్వలేదు. నిశ్శబ్దంగా నిట్టూర్చింది.

అప్పటికి సుజాత ఒక్క మాటకూడా మాట్లాడలేదు. వాసు రెండు అరచేతులూ సుజా చెక్కిళ్ళకు చేర్చి—పద్మంలావున్న ముఖాన్ని దోసిట్లో పట్టుకుని సుజా కళ్ళలోకి చూడబోయాడు. తృళ్ళిపడ్డాడు — సుజా కనుకొలుకుల్లో ముత్యాలంత కన్నీటి బిందువులు - నిలవలేక జారి వాసు చేతులమీద పడ్డాయి.

వాసు కంగారుగా చేతులమీది కన్నీటినీ — సుజా మొహాన్నీ అయోమయంగా చూశాడు—"ఏమిటిది సుజా? ఇలా చేస్తున్నావేమిటి? నే నేమన్నాననీ?"

సుజా కన్నీటితో తడిసిన కంటిరెప్పల్ని అల్లలార్చుతూ దీనంగా అంది— "నా కెందుకో .... భయంగా .... వుంది."

"భయంగా వుందా? ....ఎందుకూ? నన్ను చూసేనా?" నవ్వాడు.

"ఉహుం! కాదు. అసలు ..."

"ఏమిటి? చెప్పు సుజా! చెప్పకపోతే నాకెలా తెలుస్తుంది? నేను పరాయివాడినా? మనిద్దరిమధ్యా భయాలూ-సంకోచాలూ.... ఏవీ వుండకూడదు."

"అదికాదు." తల దించేసుకుంది సుజాత— ఒక్క క్షణం ఆగి తలెత్తి వాసు మొహంలోకి చూసింది— "నా గురించి మీ రేమి ఏమిటో వూహించుకుంటున్నారు .... ఎలా చెప్పను? .... అసలు.... ఇదంతా నా కిష్టంలేదు."

"ఇష్టంలేదా?....ఏది?....ఏదంతా?" తెల్లబోతూ అడిగాడు వాసు.

"ఇదే .. ఈ శోభనం .... యివీ ఛీ! నా కిష్టంలేదు" సుజా కంఠం పూడిపోయింది.

అసలు వాసు కేమీ అర్థంకాలేదు. వెర్రిచూపులు చూశాడు.

సుజాత చెంపలమీద కన్నీళ్ళ ధారలు కడుతున్నాయి — పులి పంజాలో చిక్కుకున్న లేడిపిల్లలాగ గజగజలాడుతూ అంది — "నన్ను చంపెయ్యండి. అడ్డురాను —కానీ — నన్నింకేమీ చెయ్యొద్దు."

ప్రాన్పడిపోయాడు వాసు. కన్నార్పకుండా చూస్తూ అచేతనంగా నించున్నాడు.

ఇద్దరిమధ్యా పావుగంటకాలం నిశ్శబ్దంగా గడిచింది

వాసు అప్రయత్నంగా సుజాత భుజంమీద చెయ్యి వేశాడు.

పిరికిగా చూసింది సుజాత.

మృదువుగా అన్నాడు వాసు— "నీ కెందు కిష్టంలేదు?"

"ఏమో!—నా కిష్టంలేదు?—ఎవరైనా పెళ్ళి చేసుకుందామను కున్నావా? —"

"ఉహూఁ! కాదు. మీరంటే నా కెంతో యిష్టం" కళ్ళు మెరపుతో చూసింది.

"నిజం చెప్పు సుజా! ఇంతవరకూ వచ్చిన తర్వాత దాపరికం ఎందుకు? నే నంటే నీ కిష్టం లేకపోతే నిన్ను ముట్టుకోను. మిగిలిన దంతా తర్వాత ఆలోచిద్దాం."

"కాదు. నిజంగా — మీరంటే — నా కెంతో యిష్టం" విశ్వాసంగా చూస్తూ అంది.

"మరి — నేనంటే యిష్టమే. నా కోరికలంటే యిష్టంలేదు ఇదంతా అమోమయంగా వుంది. నా కేమీ అర్థం కావడంలేదు సుజా !— పోనీ — ఇంకా కొన్నాళ్ళు పోయాక — నేను వస్తే బావుండేదా ?"

సుజాత మాట్లాడలేదు. భయంగా చూసింది.

వాసు నిశితంగా చూస్తూ అన్నాడు — "అసలు నువ్వు పెళ్లెందుకు చేసుకున్నావు ?"

"......... ........."

"మాట్లాడవేం ? నువ్వేం చిన్నపిల్లవా ? నీకేం తెలీదా ?"

దోషిలా అంది. "తెలుసు. పెళ్ళి చేసుకోనన్నాను. మా వాళ్లెవ్వరూ వినలేదు. సంబంధం చూసి లగ్నం పెట్టేశారు. నేను చచ్చిపోదామనుకున్నాను. ఏం చెయ్యాలో తెలియలేదు. నాకు ఇష్టంలేకుండానే పెళ్ళి అయిపోయింది. నిజంగా నేను తప్పే చేశాను. ఇంత ధైర్యం అప్పుడే ఉంటే పెళ్ళి చేసుకునేదాన్ని కాదు "

పుక్కిటిపురాణం విన్నట్టు విన్నాడు వాసు— "మగవాళ్ళంటే నీకు కోపమా ?"

"అదేం ప్రశ్న ?" అన్నట్టు చూసింది సుజాత— "మగవాళ్ళంటే ఎందుకు కోపం ?" ఎదురుప్రశ్న వేసింది.

సుజాత ఏమిటో అర్థంకాలేదు వాసుకి— "నువ్వేమైనా కథలవీ చదువుతూ వుంటావా ?"

"చదవను. చిన్నప్పుడు చదివేదాన్ని. మా అమ్మ తిట్టేది. ఇప్పుడు నా కే కథలు చదివినా నచ్చవు, ఏ సినిమాలు చూసినా బావుండవు.

వాసు కొంతసేపు మాట్లాడలేదు — దీర్ఘంగా ఆలోచనలో మునిగిపోయాడు— "మన పెళ్ళయిన మర్నాడు నువ్వు గదిలోకి రాకూడదన్నారు. అది నిజమేనా ?"

సుజాత మాట్లాడలేదు.

వాసు కోపంతో వుడికిపోయాడు — "ఎందు కింత దారుణంగా మోసం చేశావు నన్ను? ఈ మాట ఆనాడే చెప్పవచ్చుగా ? ఈ భాగ్యాని

కేనా ఇన్ని నెలలు ఎదురుచూసింది నేను ? సంవత్సరంనుంచీ నన్నెందుకిలా మభ్యపెట్టావు ?"

సుజాత భయంగానే ప్రాధేయపడుతూ "అప్పుడు మీగురించి నాకేమీ తెలీదు. గదిలోకి రావటానికి భయపడ్డాను" అంది.

"ఇప్పుడు ?"

"మీరు మంచివారని.... నన్ను అర్థం చేసుకుంటారని...."

"ఛీ ! ఇలాంటి మంచితనం మగవాడి కెందుకు ? నిన్ను నేనే కాదు. ఎవ్వడూ అర్థంచేసుకోలేడు. పుట్టెడు సంతోషంతో పెళ్ళి చేసుకున్నాను. భార్యతో తనివితీరా సుఖపడాలని వచ్చాను. అద్భుతంగా స్వాగతం యిచ్చావు. మంచివాడినని బిరుదు అప్పజెప్పావు. నిన్ను నేనే అర్థంచేసుకోవాలి గానీ — నన్ను నువ్వు అర్థంచేసుకోకు. నా బాధ నువ్వు పంచుకోకు........"

సుజాత ధైర్యంగా అంది — "నేను మీకు తగను—నాకు తెలుసు. పెళ్ళికిముందు నే నింత ధైర్యంగా ఆలోచించుకోలేదు. లేకపోతే నా తెలివితక్కువతో మీ జీవితాన్ని పాడుచెయ్యను. ఇప్పుడుమాత్రం ఏం మించిపోయింది ? మీరు మళ్ళీ పెళ్ళి చేసుకోండి. ఈ మాటే మీకు చెప్పాలనుకుంటున్నాను."

వాసుకి భరించలేనంత కోపం వచ్చింది—"పెళ్ళి ! పెళ్ళంటే.... నీకు బొమ్మలాటలా వుంది. మనుషులంటే పురుగు లనుకుంటున్నావు."

ఇద్దరిమధ్యా దారుణమైన నిశ్శబ్దం !

వాసు—తనకి సడన్‌గా పిచ్చి ఎత్తకుండా వుండటానికి మనస్సుని మాలిమి చేసుకోవాలని విశ్వప్రయత్నం చేస్తున్నాడు. సుజాతని పీక పిసికి చంపేసి — తన తల గోడకి కొట్టుకుని చచ్చిపోదా మనిపించింది.

కళ్ళు గట్టిగా మూసుకుని మంచంమీద వాలిపోయాడు.

* * *

భళ్ళున తెల్లవారింది.

జానకి హాస్యాలతో వాసు లోకంలో పడ్డాడు.

"మరిది మొహంలో ఇన్నాళ్ళకి కళ చూశాను," అంది జానకి.

వాసు నవ్వాలని ప్రయత్నించాడు.

"ముంగిలా మాతో ఒక్కమాట మాట్లాడింది కాదు. మాటలన్నీ మూటకట్టుకొచ్చి నీకు అందించింది కాబోలు" అంది మళ్ళా.

"ఆఁ మరే తెల్లవార్లూ చెవుల్లో హోరెత్తి చచ్చాను" అన్నాడు వాసు నవ్వుతూ.

తను మళ్ళా నవ్వగలుగుతా ననుకోలేదు వాసు. నవ్వుతూ వదిన హాస్యానికి జవాబులు చెప్తోంటే మనస్సు చాలా ప్రశాంతంగా వుంది.

ఒక్కడూ ఆలోచిస్తూ పడుకున్నాడు. పెళ్ళయిన స్నేహితులందరూ గుర్తు వచ్చారు. "మీ కిలా అయిందా?" అని ఒక్కొక్కళ్ళనీ అడగాలని పించింది— సుజా ఎందుకో— అసహ్యించుకుంటోంది. ఇలాంటి ఆడవాళ్ళ గురించి తను కొన్నిసార్లు విన్నాడు. చిన్నప్పుడు ఆడవాళ్ళ దగ్గర కూర్చుంటే, ఏవేవో కబుర్లతో పాటు యిలాంటి విశేషాలుకూడా చెప్పుకుని నవ్వుకునేవారు - "కామాక్షి చూశావా, వదినా! గదిలోకి వెళ్ళమంటే ఒకటే ఏడుపట. నాలుగు కేకలేసి తీరా పంపిస్తే మొగుడి జుట్టుతా పీకి, నానా గందరగోళం చేసిందట. కంచి పట్టుచీర ముక్కలు ముక్కలు చేసే సిందట. మొగుడి కోపంవచ్చి చావబాదాడుట. ఏం పోయేకాలం? దొబ్బుడాయా? ఈడొచ్చిన పిల్ల, సవర్తాడి నాలుగేళ్ళయింది. ఆమాత్రం జ్ఞానంలేదూ? ఏవోఁనమ్మా! మన కాలంలో ఎరుగుదువా? పదకొండో ఏట పెద్దదాన్నయ్యాను నేను పన్నెండో ఏట మా పెద్దవాడు కడుపున పడనేపడ్డాడు"—అలాంటి కబుర్లు బాగానే గుర్తున్నాయి వాసుకి. కామాక్షి మొగుడిజుట్టు పీకడం ఎందుకో—మొగుడు కామాక్షిని కొట్టడం ఎందుకో వాసు బాగా పెద్దవాడయ్యి రకరకాల పుస్తకాలు చదువుతోంటే తెలిసింది—కొంతమంది ఆడవాళ్ళలో ఇలాంటి మన స్తత్వం వుంటుందిట.

భార్యాభర్తల సంబంధం గురించి....వాళ్లు చాలా సిగ్గుచేటుగా జుగుప్సాకరంగా వూహించుకుంటారు. పెద్దవాళ్ళ ప్రవర్తనా - ఇంటి పరిస్థితులూ దానికి బాగా దోహదం చేస్తాయి. చిన్నప్పుడే వాళ్ళ మనసులమీద బలమైన ముద్రలు పడతాయి. అవి చెరగాలన్నా, చెరపాలన్నా యుగాలు చాలవేమో !

సుజాత గురించి ఎవరయినా మంచి డాక్టర్‌తో కన్సల్ట్ చేస్తే - అనుకున్నాడోసారి. కాని .... వెంటనే ఆ అభిప్రాయం మార్చుకున్నాడు. సుజాత తత్వం కొంత వరకైనా తను వూహించగలడు. ముందు సుజాత భయం, అసహ్యం పోగొట్టాలి. సుజాతకి తనమీద వుత్త అభిమానం ఎంత వున్నా సరిపోదు; కాంక్ష పుట్టాలి - శరీరాన్ని వెర్రెత్తించే కోరిక పుట్టాలి. అంతవరకూ సుజాతని తను బెదరకొట్టకూడదు - తప్పదు. తను భరించక చేసేదేమీ లేదు - అవిరామంగా రోదిస్తోన్న వాసు హృదయం తాత్కాలికంగా శాంతించింది.

* * *

రెండోరోజు రాత్రి తొందరగా గదిలోకి వచ్చింది సుజాత.

వాసు నవ్వుతూ మామూలుగా వుండాలని ప్రయత్నించాడు.

సుజాత లేత పసుపురంగు జరీచీర కట్టుకొంది. ఆ రంగు లైటు వెలుగులో అందమైన తెలుపులా కన్పిస్తోంది. మొగ్గ విడీ విడని గులాబీ పువ్వు పెట్టుకుంది తలలో. క్రితం రాత్రికన్నా ఎంతో అందంగా అద్భుతంగా కన్పించింది. వాసు దృష్టి మరల్చుకుని తనని తను హెచ్చరించుకొన్నాడు. ఆల్మైరా దగ్గిరికి నడిచి పుస్తకాలు వెదుకుతూ నుంచున్నాడు. ఏదో పుస్తకం తీసుకుని వెనక్కి తిరుగుతూ - "అదేవిటి ? అలా నిలబడి పోయా వెందుకు ? కూర్చో ? ఇలా రా !" అన్నాడు మంచంమీద కూర్చుంటూ.

సుజాత దగ్గిరికి వచ్చింది. దూరంగా మంచం వారన కూర్చుంది.

వాసు కొంచెం నవ్వి – "ఇంకా నేనంటే భయంగా వుందా ?" అన్నాడు.

సుజాత సిగ్గుపడ్డట్టు వూరుకుంది.

"రాత్రి విషయం ఎవరికైనా చెప్పావా ?"

"అడిగారుగానీ చెప్పలేదు."

"ఎవ రడిగారు ?"

"మా అక్క అడిగింది."

"ఏమనీ ?"

"ముందు ఎవరు మాట్లాడారే అంది–నేనేం చెప్పలేదు."

"ఏం ?"

"నా కిష్టంలేదు. మన విషయం పైవాళ్ళ కెందుకు ?"

వాసు నవ్వాడు– "పై వాళ్ళెవరు? మీ అక్కేగా?"

"అయితే మాత్రం ?"

"మరి నువ్విలా చేస్తున్నావని మీ అక్కకు తెలీదా !"

సుజాత మాట్లాళ్ళేదు.

వాసు కాస్సేపు పుస్తకం తిరగేశాడు— "నిద్రొస్తోందా ?" అన్నాడు తలెత్తి.

"ఉహూఁ లేదు"

"ఫర్వాలేదు పడుకో. నేను కాస్సేపు చదువుకుంటాను."

సుజాత కూర్చునేవుంది; వాసుకి చదవటం దుర్భరంగా వుంది. పుస్తకం మూసేసి లేచి నించున్నాడు— "విసుగ్గా వుంది సుజా! ఏమీ తోచటంలేదు."

"నిద్ర పోతారా ?"

"నిద్రకీ నాకూ ఆమడదూరం" వాసు కొంచెం నవ్వుతూ చూశాడు.

"ఎదురుగా నిన్ను చూస్తూ నిద్రపోవటం ఎలాగ ?" సుజా మొహం కొంచెం ముడుచుకున్నట్టు అయింది.

వాసు గ్రహించినట్టు అన్నాడు— "పోనీ ఏదైనా పిక్చర్‌కి వెళదామా ?"

"ఇప్పుడా ?"

"ఫర్వాలేదు టైం వుంది. కొంచెం కాలక్షేపంగా వుంటుంది."

"మా అమ్మావాళ్ళు ఏమైనా అంటారేమో !"

"నేను తీసుకెళ్తోంటే ఏమంటారు ?"

"సరే ! పదండి."

వాసు బట్టలు వేసుకుంటోంటే జానకి విసుక్కోయింది— 'ఇదేం చోద్యవమ్మా ? శోభనం పెళ్ళికొడుకూ – పెళ్ళికూతురూ సినిమాకి వెళ్ళటం ఏమిటీ ?' అంది సాగదీసూ.

వాసు నవ్వాడు. వాళ్ళిద్దరూ వెళుతోంటే జానకిలా విస్తుపోలేదు, సావిత్రి దూరంగా వెళ్ళిపోయే వరకూ చూస్తూ నుంచుంది.

• • •

మూడోరోజు బీచ్‌కివెళ్లారు ఇద్దరూ. సుజాత ఉత్సాహంగావుంది. మనస్ఫూర్తిగా మాట్లాడుతోన్నట్టు కన్పించింది.

"బి.ఏ. అయ్యాక ఏం చేద్దామనుకుంటున్నావు?" అన్నాడు వాసు.

"నే నేమీ అనుకోవటంలేదు– మీరు చెప్పండి."

"నే చెప్పేది నీకు నచ్చకపోతే....?"

"ఎందుకు నచ్చదు? నచ్చుతుంది."

"ఏం చెప్పినా నచ్చుతుందా ?"

సుజాత ఉత్సాహం భంగపడింది. మొహం ముడుచుకుంటూ అంది – నాకు ఒకే ఒక్క విషయం యిష్టం లేదని మీకు చెప్పాను. అది తప్పితే ఏం చెప్పినా వింటాను."

"ఆ ఒక్క విషయమే నాకు ఎంతో ముఖ్యమైందని నీకు తెలీదా?

ఇష్టం వుండకపోవటానికీ లేకపోవడానికీ కారణం వుండాలి అర్థం ఉండాలి. ఇంతవరకూ నేను నిన్ను నిర్బంధించి అడగలేదు. జీవిత మంతా మన ఇద్దరికీ వుండాల్సిన బంధాన్ని నువ్వు ఇష్టంలేదంటే నే నేమై పోతానో ఆలోచించావా?"

సుజాత చాలా సేపు మాట్లాడలేదు. చివరికి అంది – భరించరాని విషయాన్ని భరిస్తోన్నట్టు–బాధనంతా కంఠంలో పోగుచేసుకుని – విషాదంగా అంది– "ఇంతవరకూ నే నెంతో పవిత్రంగా వున్నాను కానీ... "

"సుజా! నువ్వు చాలా తప్పుడభిప్రాయాలు పెట్టుకున్నా - నిన్ను చూస్తే నిజంగా నాకు జాలేస్తోంది. అసలు పవిత్రం అంటే అర్థం తెలుసా నీకు? ఎవరి ధర్మం వాళ్ళు నిర్వర్తించడమే పవిత్రత. పుట్టినవాళ్ళు పుట్టినట్టు వుండిపోవడానికే పుట్టామా మనం? అలా అయితే ఈ ఆకర్షణ లెందుకు? ఇదంతా వ్యర్థమేనా? ఎప్పుడూ ఆలోచించలేదా నువ్వు?"

సుజాత మౌనంగా కూర్చుంది.

వాసు అనునయంగా అన్నాడు– "ఇవ్వాళ ఈ సంబంధం నీకూ నాకూ కొత్తా? భూమి ఎప్పుడు పుట్టిందో మనకు తెలీదు. కొన్ని వందల కోట్ల సంవత్సరాలైందని అంటున్నారు. అప్పట్నుంచి కూడా కోటాను కోట్ల జీవరాసులమధ్య అవిరామంగా సాగుతోంది సంబంధం. ప్రకృతి అంతా నిండివుంది ఈ నిజం. దీన్ని అర్థం చేసుకోవాలని నువ్వెందుకు ప్రయత్నించవు?"

సుజాత నిర్వికారంగా అంది – "ఎంత ప్రయత్నించినా నాకా అర్థం నచ్చటంలేదు. సంసారం త్యజించి, యోగులయిన వాళ్ళంతా ఎందు కయ్యారు? తుచ్ఛమైన శారీరక సుఖాల్ని మించింది ఏదో ఉందని ఎందుకు చెప్తున్నారు? తపస్సు చేసుకుంటూ బ్రతికేవాళ్ళకి ఈ సంసారం – ఈ సృష్టి – ఈ ప్రకృతి ధర్మాలూ .... ఇవన్నీ తెలియ లేదా?"

వాసు విసుగోయాడు. సుజాతని చూస్తోంటే భయం వేసింది. ఈ పిల్ల కొన్నాళ్ళకి సర్వం త్యజించి సన్యాసి అయిపోదుగదా అని

పించింది. కొంచెంసేపు తనుకూడా నిశ్శబ్దంగా కూర్చున్నాడు– "తపస్సు చేసేవాళ్ళంతా ఎందుకుచేస్తారనుకొంటున్నావు?" కొంతసేపటికి అడిగాడు.

విస్మయంగా చూసింది సుజాత– "ఎందు కేమిటి? భగవంతుణ్ణి చూడాలని...."

"భగవంతుణ్ణి చూడటం ఎందుకు?"

"..............."

"చెప్పు సుజా! మనిషి కర్తవ్యం భగవంతుణ్ణి చూడటం ఒక్కటేనా? అందుకా మనం.... కాళ్ళూ—చేతులూ. కళ్ళూ....నోరూ — యవ్వనం — వాంఛలూ ఇవన్నీ పెట్టుకు పుట్టింది? భగవంతుణ్ణి చూడాలంటే మార్గం ముక్కుమూసుకుని తపస్సు చెయ్యటం ఒక్కటేనా? అసలు భగవంతుడంటూ మూర్తీభవించి ఎక్కడయినా ఉంటే–"మీరంతా సర్వం త్యజించి నన్ను చూడటానికి రండి" అని ఎప్పుడూ అనడు. అనేవాడైతే మనుషుల్ని ఇలా సృష్టించడు. మనిషికి భగవంతుణ్ణి చూడాల్సిన అవసరంలేదు. భగవంతుణ్ణి కలలోకూడా తల్చుకోవాల్సిన అవసరంలేదు. మనిషి పుట్టింది అందుకు కాదు."

అమితంగా ఆశ్చర్యపడింది సుజాత – "మరి తపస్సు చేసేవాళ్ళంతా ఎందుకు చేస్తున్నారు?"

"నా వూహ చెప్పమంటావా? తపస్సులో సుఖం వుంది. ఆరాధనలో సుఖం వుంది. పూజల్లో, ప్రార్థనల్లో తృప్తి వుంది. ఇది మానసికానందం. రుచిగల పదార్థం తింటే జిహ్వ ఆనందిస్తుంది. సువాసనలు పీల్చితే ముక్కుకి సుఖంగా వుంటుంది. మధురమైన శబ్దాలు వింటే చెవికి ఇంపుగా ఉంటుంది. శరీరంలోవున్న అవయవాలు పొందే ఆనందం కన్నా — తపస్సుచేసి మనసు పొందే ఆనందం గొప్పదై వుంటుంది. అందుకే దాన్ని బ్రహ్మానందం అన్నారు. అదికూడా మనిషి స్వార్థం కోసం నేర్చుకున్నదే. శరీరసుఖాలు త్యజిస్తున్నారు. మనస్సుకి కావలసిన సుఖాలు వెదుక్కుంటున్నారు. ప్రార్థనలు చేస్తారు. భజన పాటలు పాడతారు. సమాధిలో కూర్చుంటారు, అదంతా భగవంతుడి కోసం అంటు

న్నారు. ఎంత భ్రమ! మనిషి ధర్మం భగవంతుణ్ణి వెదకటమే అనుకో వటం ఇంకా భ్రమ."

వాసు మాటలు సుజాత కేమీ నచ్చలేదు నమ్మబుద్ధి కాలేదు.

"నేనంటే ఎంతో ప్రేమ అన్నారే! నా శరీరం మాత్రమే మీకు కావాలా?"

"శరీరం లేకుండా నువ్వెక్కడ ఉన్నావు ప్రేమించటానికి?"

"నా మనస్సు మీకు అక్కర్లేదా?"

"మనస్సు శరీరంలో లేదా? ఎక్కడవుందో చెప్పు. పోనీ నీ శరీరంకేసి కన్నెత్తి చూడకుండా నీ మనస్సునే ఆరాధిస్తాను."

సుజాత కొంచెం నవ్వింది—"మీతో నేను తర్కించలేను."

వాసుకి విజయగర్వం కలిగింది — "అసలిది తర్కించాల్సిన విషయం కాదు సుజా! గాలి పీల్చడం ఎంత సహజమో — స్త్రీ పురుషుల సంబంధం అంత సహజం. అది నువ్వు అర్థం చేసుకుంటే చాలు."

అంత మంచి వ్యక్తిని తను పెళ్ళిచేసుకున్నందుకు సుజాతకి మొట్టమొదటిసారిగా చాలా సంతోషం కలిగింది.

• • •

కానీ .... సుజాత మనస్సు మారలేదు.

అంత తొందరగా మారుతుందనికూడా వాసు అనుకోలేదు. సుజాత వాళ్ళింట్లో మూడు రాత్రులూ అయ్యాయి.

తర్వాత కూడా వాసూ వాళ్ళింట్లో మరో మూడు రాత్రులయ్యాయి. సుజాతని తీసుకెళ్ళటానికి వాళ్ళ మేనమామ వచ్చాడు.

తనకి సెలవులేదని వాసు రానన్నాడు. సుజాతని తీసుకుపోయాడు. సుజాత కాపరానికి రావటమా, ఎమ్. ఏ. లో చేరటమా? అన్నది భార్యాభర్తలు తేల్చుకోలేదు.

వాసు తల్లి మాత్రం తొందరగా కోడల్ని కాపరానికి తీసుకొచ్చెయ్యాలని తెగ ఆరాటపడుతోంది.

ఒక్క నెలరోజులు జరగనిచ్చి—కొడుకు దగ్గిర పాట మొదలు పెట్టింది – "పెళ్ళయి సంవత్సరం దాటింది. ఇదేం చోద్యంరా? ఇలా పెళ్ళయినవాళ్ళు అలా చెట్టాపట్టా లేసుకు తిరుగుతున్నారు. అమ్మాయిని తీసుకు రావాలంటే వద్దంటావేమిటి? కోడలొచ్చి అత్తగారికేమీ చాకిరీ చెయ్యక్కర్లేదులే. మీరిద్దరూ సుఖంగా వుండండి, అదే పదివేలు" అంటూ సాధించటం మొదలు పెట్టింది.

ఆవిడ మాటలు వినగా వినగా వాసుకో సందేహం వచ్చింది తమ ఇద్దరిమధ్యా ఉన్న రహస్యం వదిన పసికట్టేసిందేమో! అమ్మకి చెప్పేసిందేమో! అందుకే అమ్మ కోడల్ని తీసుకురావాలని అంత పట్టుబడుతోందేమో! – తన గురించి ఇంట్లో వాళ్ళంతా జాలి పడుతున్నారంటే భరించిలేకపోయాడు వాసు. ఆ రాత్రికే అత్తవారి వూరు ప్రయాణం పెట్టుకున్నాడు.

* * *

సుజాత ఎమ్. ఏ. లో చేరింది. వాసు కూడా ఒప్పుకున్నాడు. సంసారమూ లేక, చదువూ లేక – సోమరిగా ఉంటానంటే వాసుకి నచ్చలేదు. సుజాతని కాపరానికి తీసికెళ్ళక పోవటానికి చక్కటి కారణం కూడా కన్పిస్తుంది లోకానికి.

వాసు నాలుగైదుసార్లు వెళ్లాడు అత్తారింటికి. ఎప్పుడు వెళ్ళినా సుజాతా వాసూ సినిమాలకి వెళ్తారు. గంటల తరబడీ బీచ్‌లో కూర్చుంటారు. ఎక్కడికి వెళ్ళాలన్నా వెళ్ళివస్తారు. వాసు సుజాత భర్తలా కాకుండా ఒక పరిచయస్తుడిలా వుండి వెళ్ళిపోతాడు. వాసు ఉన్నన్ని రోజులూ అతని సదుపాయాలన్నీ పరోక్షంగా సావిత్రి చేయిస్తుంది. ఎప్పుడూ అతని కేదీ లోటు జరగకుండా ఏర్పాటు చేస్తుంది. వాసు పిలిస్తే పలికేలా ఒక పనిమనిషి సిద్ధంగా వుంటాడు. రకరకాల ఫలహారాలూ—భోజనాలూ — గౌరవాలూ — పెద్ద హోదాలో జరుగుతాయి వాసుకి.

వాసు సావిత్రిని అనుకోకుండా ఓసారి చాలా దగ్గిరగా చూశాడు.

వాసు డాబామీదికి వెళ్లాలని పై మెట్టుమీదికి వెళ్లాడు. సావిత్రి దిగబోతూ ఆగిపోయింది. ఇద్దరూ చాలా దగ్గిరిగా అయ్యారు. ఇద్దరూ కంగారుపడ్డారు. వాసు తప్పుకున్నాడు. సావిత్రి వెళ్ళిపోయింది. వాసు అలాగే మెట్లు దిగి వెళ్ళిపోతున్న సావిత్రిని చూస్తూ నుంచున్నాడు-- తల స్నానం చేసి గాలికోసం కాస్సేపు పైకి వచ్చింది సావిత్రి. లేత నీలంచీర కట్టుకుంది. బంగారపు గాజులు వేసుకుంటోంది. జడ వేసి ముడి చుట్టుకుంది. మెడలో సన్నటి గొలుసు వుంటుంది. బొట్టూ పువ్వులూ పెట్టుకోదు. తెలియని వాళ్ళు సావిత్రిని చూస్తే పెళ్ళికాని దనుకుంటారు. మనిషి నాజూగ్గా నవనవలాడుతూ వుంటుంది. వినయంగా హుందాగా వుంటుంది.

వాసు సావిత్రి శరీర సోయగాలు చూడలేదు. సావిత్రి కళ్ళలోకి చూశాడు అప్రయత్నంగా. విస్మయంతో, తన్మయత్వంతో మ్రాన్పడి పోయాడు. నునుసిగ్గుతో- పూజాభావంతో- ఆరాధనతో- అనురాగంతో- వుక్కిరి బిక్కిరయ్యాయి సావిత్రి చూపులు. తనుకోరుకునేలాంటి స్త్రీత్వం పరిపూర్ణంగా మూర్తీభవించి కనిపించింది.

వాసు అచేతనంగా వున్న స్థితిలో సావిత్రి వెళ్ళిపోయింది. తర్వాత కూడా రెండుమూడు సార్లు సావిత్రిని చూశాడు వాసు. సావిత్రి చేష్టల్లోనూ-- సావిత్రి కదలికల్లోనూ-- సావిత్రి నడకల్లోనూ ఔన్నత్యం- సౌందర్యం చూశాడు.

"స్త్రీ ఇలా వుండాలి, ఇలా వుండాలి" అనుకున్నాడు. వాసు వూహల్లోంచి సుజాత మాయమై చాలా కాలం అయింది. అయినా వాసు సుజాత దగ్గిరికి వచ్చి వెళ్తోనే వున్నాడు.

వాసు వూహలు అప్రయత్నంగా సావిత్రీనిముట్టడించటం ప్రారంభ మైంది. వాసు చాలా నొచ్చుకున్నాడు. చాలా భయపడ్డాడు. తనని తను తిట్టుకున్నాడు. హెచ్చరించుకున్నాడు - ఓడిపోయాడు.

తను చాలా తప్పుచేశాడు. శోభనం జరిగిన మర్నాడే విషయం

6)

సిగ్గు విడిచి వదినకు చెప్పేయ్యాల్సింది. "సుజాత ఇలా అంది. కావాలంటే నన్ను మళ్ళీ పెళ్ళిచేసుకోమంది పెద్దవాళ్ళంతా ఏం ఆలోచిస్తారో ఆలోచించండి" అని వ్యవహారం పదిమందిలో పడెయ్యాల్సింది. ఈ సరికి తనకి మళ్ళీ పెళ్ళికూడా అయ్యేది. తనకీ రంపపుకోత తప్పేది. కానీ.... సంవత్సరం నుంచీ ఎదురుచూసి ఎదురుచూసి....అంత నిరభిమానంగా మనసు విరుచుకోలేక పోయాడు. శాశ్వత బంధం అని నమ్మి కట్టిన మాంగల్యానికి విలువలేకుండా చేసుకోలేకపోయాడు. కష్టమో నిష్టూరమో భరించాలనుకున్నాడు. తన తప్పేముంది ?

* * *

వాసుకి తనమీద తనకి నమ్మకం పోయింది. సుజాత కోసం నిరీక్షించడంలో మాధుర్యం పోయింది. అతి ప్రయత్నంమీద తనని తను మభ్యపెట్టుకుంటూ వస్తున్నాడు. సుజాత మారుతుంది తప్పకుండా మారిపోతుంది, తప్పకుండా. ఆ తర్వాత తన జీవితం చాలా సుఖంగా, శాంతిగా, హాయిగా సాగుతుంది. అన్న నమ్మకాన్ని కొనవూపిరితో బ్రతికించుకుంటూ రోజులు దొర్లిస్తున్నాడు.

వాసు అత్తవారింటికి వచ్చి రెండు రోజులైంది. వాసు మనసు వాసు చేష్టల్ని పరిహసించటం మొదలు పెట్టింది. "నువ్వు సుజాతకోసం రాలేదు. సావిత్రి కోసం వచ్చావు" అంది.

"కాదు, కాదు. నాకు యిద్దరూ ఒకటే. సుజాత మాత్రం నాకేం ఒరగబెట్టింది ?" అన్నాడు నిర్లక్ష్యంగా.

"అయితే నువ్వు సావిత్రికేం ఒరగబెడతావు ?" అంది వెటకారంగా.

వాసు జవాబు చెప్పుకోలేక పోయాడు.

ఆ రోజు పొద్దుట్నుంచీ ఆకాశం మబ్బుపట్టే వుంది. పగలంతా వాసూ సుజాతా కాస్సేపు పేకతోటీ —కాస్సేపు కేరమ్సుతోటీ గడిపారు.

దీపాలు పెట్టే వేళనుంచీ సన్నసన్న చినుకులతో ప్రారంభమైంది వర్షం. చూస్తోండగా హోరుమంటూ కురవసాగింది. వాసు కిటికీ దగ్గర వర్షం చూస్తూ నించున్నాడు. వర్షం ఏకధారగా అవిరామంగా కురుస్తోంది.

వాసు మొహం, చేతులు, చొక్కా అన్నీ తడిశాయి వర్షపు జల్లులో.

"అదేమిటి? అలా తడుస్తూ నించున్నారు" అంది సుజాత లోపలికొస్తూ. "వర్షం గదిలో కొస్తోంది కిటికీ వేసెయ్యండి మీరు బట్టలు మార్చుకోండి" అంది పక్కనే నించుంటూ.

"ఆఁ, ఫర్వాలేదు. గదిలో నీళ్ళు తుడిచేస్తే పోతాయి. వాన కురవటం చూస్తోంటే ఎంత బావుందో చూడు" అక్కణ్ణుంచి కదల్లేదు వాసు.

వాసుకి అందంగా కనిపించని దృశ్యం ఏదైనా వుందో లేదో సుజాతకి తెలీదు —

"వెన్నెలెంత బావుందో చూడు" అంటాడు.

"ఈ మందారపు పువ్వు బావుంది కదూ?" అంటాడు. ఆఖరికి పచ్చగడ్డి కూడా నచ్చుతుంది.

సుజాత మనసుకి ఏ అందమూ అర్థం కాదు. వర్షం కురుస్తోంటే పుట్టెడు దిగులు ముంచుకొస్తోంది. లోకమంతా ఏదో విపత్తులో మునిగి పోతున్నట్టు వుంటుంది.

"తడిబట్టలతో జలుబు చేస్తుంది. ముందు బట్టలు మార్చుకోండి. పదండి, భోంచేద్దాం" అంది సుజాత వాసు చెయ్యి పట్టుకుంటూ.

వాసు చెయ్యి విదిలించుకున్నాడు — "నాకేం బాగాలేదు సుజా! నువ్వెళ్ళి భోంచేసిరా !"

"ఏం ? ఏం బాగాలేదు ?"

"ఏమో ! అన్నం తినాలని లేదు. నువ్వెళ్ళు. నిజంగా నాకు ఆకలి కూడా లేదు."

"పోనీ కొంచెం పాలు తాగండి పంపిసాను."

"నా మాట విను. ఇవ్వాల్టికేమీ వద్దు. నువ్వెళ్ళి భోంచేసిరా!"

సుజాత కాస్సేపు కూర్చుని వెళ్ళిపోయింది.

కొంతసేపటికి పనికుర్రాడు వెండిగ్లాసు నిండా పాలు తీసుకు వచ్చాడు.

"అక్కర్లేదని చెప్పానే! తీసికెళ్ళు" అన్నాడు వాసు చిరాగ్గా.

"పెద్దమ్మాయిగారు పంపించారండీ! తప్పకుండా తీసుకోమని చెప్పమన్నారండీ!"

వాసు ఆశ్చర్యం వెల్లడించకుండా - "బల్లమీద పెట్టు" అన్నాడు.

పని కుర్రాడు వెళ్ళిపోయాడు.

వాసు లేచి గ్లాసు తీసుకున్నాడు.

యాలకులపొడి వేసిన పాలు! ఘుమఘుమ పరిమళిస్తూ, తియ్యగా మధురంగా వున్నాయి. సావిత్రి ఈ పాలనిండా తన అనురాగం రంగరించి పంపిందేమో ! ఎందుకింత దయ తనంటే.

వర్షం తగ్గినట్టే తగ్గి మళ్ళీ కురవటం ప్రారంభించింది. వాసు కుర్చీ వేసుకుని కిటికీ దగ్గిర కూర్చున్నాడు.

సుజాత లోపలికి వచ్చింది-రేడియో ట్యూన్‌చేసి ఏదో పుస్తకం తీసుకుంది.

పాట సగంలోంచి వస్తోంది——

"శృతిలేని నా మదికి
చతురగీతా లేల?
గతి రాని పాదాల
గతుల నృత్యంబటే!
పాడకే నా రాణి
పాడకే పాట
పాట మాధుర్యాల
ప్రాణాలు పరిగెనే!
పా....డ....కే!"

వాసు కుర్చీలో వెనక్కివాలి పాటవింటూ కళ్ళు మూసుకున్నాడు. విషాదం గుండెల్ని బరువెక్కించింది. అర్థంకాని దుఃఖంతో వాసు ప్రాణాలు తల్లడిల్లాయి. శరీరం కంపించసాగింది.

పాట వెనక పాట వస్తోంది.

వాసు స్వప్నావస్థలో లీనమైపోయాడు.

సుజాత క్లాసు పుస్తకం చదువుకుంటూ కూర్చుంది.

ఇద్దరిమధ్యా గంటలకు గంటలే నిశ్శబ్దంగా దొర్లిపోయాయి.

సుజాతకి హఠాత్తుగా జ్ఞాపకంవచ్చి టైం చూసింది — పదకొండు పైన! ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. లేచి లైటార్పి డిమ్‌గా వెలిగే లైట్ వేసింది వాసు దగ్గరికివెళ్ళి— "చాలా రాత్రయింది, మీరు పడుకోండి" అంది.

వాసు తలెత్తి సుజాతని చూశాడు. ఎప్పుడూ లేనంత మత్తుగా చూశాడు. సుజా చెయ్యి అందుకుని దగ్గరికి లాక్కున్నాడు — "సుజా ఈ రాత్రి .... ఎంత బావుంది! ...."

సుజాత తెల్లబోయింది. వాసు ఎప్పుడూ అలా చెయ్యలేదు. అలా చూడలేదు. తమాయించుకుంటూ అంది— "లేవండి. తడి బట్టలతో ఇంత సేపు వుంటే జబ్బు చెయ్యదా?"

"చెయ్యనీ! అంతకన్నా అదృష్టం ఏముంది?" వాసు లేచి నించున్నాడు. "సుజా! ఆ వర్షంచూడు. ఆకాశంకన్నా ఘోరంగా ఏడుస్తోంది నా హృదయం. చెప్పు. నేనిక భరించలేను" వెర్రివాడిలా చూశాడు.

సుజాత గంభీరంగా నించుంది — "మీరు చెప్పండి. ఇలా ఎల్లకాలం మనం స్నేహితుల్లా వుండలేమా?"

"స్నేహితుల్లా ఇలా దూరదూరంగా.... స్నేహితుల్లా ........" విసుపోయాడు వాసు— "ఒక మగవాడూ—ఆడదీ— ఇంత సన్నిహితంగా స్నేహంచేస్తే వాళ్ళు తప్పకుండా భార్యాభర్తలవుతారు సుజా. మనం పుత్త స్నేహితుల్లా.... వుంటే.... ఎంత కోల్పోతామో.... జీవితంలో ఎన్ని

సుఖాలు.... ఎంత ఆనందం పోగొట్టుకుంటామో తెలుసా ? నా మాట విను....మన మధ్య స్నేహం... చాలదు. సహచర్యం ఉండాలి. అప్పటికి గానీ మన జీవితాలు సార్థకం కావు. ఈ మూగబ్రతుకు ఎన్నాళ్లు ? సుజా నా మాట వినవా ?.... ఇదే మనకు శోభనం రాత్రి. ఇలాంటి రాత్రులెన్ని వ్యర్థం చేసుకున్నాం !" వాసు శరీరం ఆపాదమస్తకం దహించుకు పోసాగింది. సుజాని గాఢంగా హత్తుకుని చేతులతో బంధించివేశాడు.

"ఛీ ! ఏమిటిది ? మీరు చాలా మంచివారనుకున్నాను. ఏమిటీ బలవంతం ?"

ఏడుపు మొహంతో పట్టు వదిలించుకోవాలని పెనుగులాడింది సుజాత.

"అవును. నేను మంచివాణ్ణికాదు... నువ్వేమైనా అనుకో....ఫర్వా లేదు. పశువు ననుకో .. రాక్షసుణ్ణనుకో" వాసు చేతులు ఇంకా బలంగా పెనవేసుకున్నాయి. సుజాత చెంపలకి గాడుపులాంటి నిట్టూర్పు తగిలింది.

సుజాత శరీరం జలతరించింది.

వాసూ తనువు పులకరిస్తోంది.

సుజాత మనసు కుంచించుకు పోయింది.

వాసు హృదయం నరిస్తోంది.

"అబ్బా !" — బాధతో విలవిల్లాడుతూ పట్టు వదిలేశాడు వాసు — సుజాత వాసు చేతిమీద మునిపళ్ళు దిగేలా కొరికేసింది.

బొటబొటా రక్తం చుక్కలు నేలమీద పడ్డాయి.

వాసు రెండో చేతితో గాయాన్ని అదిమి పట్టుకుని తూలుతూ తూలుతూ గది బయటికి వెళ్ళిపోయాడు.

సుజాత కుప్పలా కూలిపోయింది. మొహానికి రెండుచేతులూ కప్పుకుని వెక్కి వెక్కి ఏడవటం మొదలు పెట్టింది.

వాసు వరండాలోకి వెళ్ళబోతే తన గదిముందు చదువుకుంటోన్న సావిత్రి దిగ్గున లేచింది. సావిత్రి గదిలో లైటు వెలుగుతోంది. వెలుగు వరండాలోకి పడుతోంది. సావిత్రి వాసుని చూసి చాలా కంగారుపడింది.

"ఏమిటి? .... మీకేమైనా కావాలా ?....సుజా....?"

"సుజా ఇచ్చిన బహుమానం చూడండి" వాసు సావిత్రి మీదికి చెయ్యి చాపాడు. రక్తంతో తడిసి మోచేతి దగ్గిర్నుంచీ అరచేతి వరకూ భయంకరంగా కన్పించింది.

"అయ్యయ్యో! ఏమిటిది? ఏమయింది?" ఏం చెయ్యాలో తెలీక వెర్రిదానిలా చూసింది.

"కొంచెం నీళ్ళు వుంటే యివ్వండి" అన్నాడు వాసు.

సావిత్రి గదిలోకి పరిగెత్తి కూజా తెచ్చింది.

వరండా చివర వాసు చేతులమీద నీళ్ళు పోసింది. కూజా క్రింద పెట్టి మళ్ళా గదిలోకి పరుగెత్తింది. మెత్తనిగుడ్డ తీసికొచ్చింది. వెడల్పుగా మడతపెట్టి ఒత్తుగా కట్టు కట్టింది.

"చాలా బాధగా వుందా?"

"బాధగానే వుంది."

సావిత్రి మనస్సంతా వాసు పట్ల జాలితో, సానుభూతితో, అనురాగంతో పొంగి పొర్లింది. ఆ భావాలు ఇప్పటికిప్పుడు ఏర్పడినవి కావు.

వాసు సావిత్రి మొహంలోకి చూస్తూ అడిగాడు-"మీ చెల్లెలిగురించి మీకేమీ తెలీదా?"

సావిత్రి దోషిలా అంది—'తెలుసు' మా కందరికీ తెలుసు. కాసేపు మౌనంగా వూరుకుంది. తర్వాత అభిమానంగా చెప్పింది—

"మావాళ్ళు మొదట్లోనే చాలా పొరపాటు చేశారు. అది పెళ్ళి వద్దని ఏడ్చింది. నాలుగు చివాట్లేసేసరికి వూరుకుంది. పెళ్ళయితే అదే మారుతుందనుకున్నారు. తీరా శోభనంనాడు ససేమిరా గదిలోకి వెళ్ళనని ఏడుస్తూ కూర్చుంది. ఏంచెయ్యాలో తోచక బయటుందని వంకపెట్టారు. నెల లోపల శోభనం అనుకుంటేకూడా అది ఒప్పుకోలేదు. జ్వరం వస్తోందనీ ఉత్తరం రాశారు. తర్వాతంతా మీకు తెలుసు. మీరు రాసిన వుత్తరాలు చదవటం కూడా దానికి యిష్టం వుండేదికాదు. అది మొదటినుంచీ ఏమిటోలా వుండేది. మా తాతగారు పడుచుతనంలోనే సన్యాసుల్లో కలిసి

పోయారట. ఆ తత్వం దీనికి వచ్చిందేమోనని మావాళ్ళంతా బెంగపడుతు న్నారు. తొందరపడి పెళ్ళి చేశామని ఇప్పుడు చాలా పశ్చాత్తాప పడుతు న్నారు. కానీ.... మీరు దాన్ని నెమ్మదిగా మార్చుకుంటారని...." ఆగి పోయింది.

సావిత్రి మాటలన్నీ విన్నాడు వాసు — "మారటం ఇష్టంలేని వాళ్ళని మార్చటం ఎవరి వశం?"—ఇక నేను చెయ్యగలిగిందేమీలేదు.

"అలా అనకండి—మీ బాధ నాకు తెలుసు. దేవుడుకూడా మీకన్న మంచిగా వుండడు. దాని అదృష్టంకొద్దీ మీరు దొరికారు. అది చిన్నపిల్ల. మీరే కాదంటే ఏమౌతుంది?"

"ఏమీ అవ్వదు. నిక్షేపంలా వుంటుంది."

"మీరలా అంటే నేనేం చెప్పను?"

"ఏమీ చెప్పద్దు."

వాసు సావిత్రి మొహంలోకి గుచ్చిగుచ్చి చూశాడు - "మిమ్మల్ని నేనోమాట అడగనా?"

"అడగండి."

"మీకు నేనంటే ఇష్టమేనా?"

తడబడింది సావిత్రి-"అదేమిటి? మీరంటే నాకెందుకు యిష్టం వుండదూ!"

"అదికాదు. మీ మరిదినని కాదు."

"మరిదివి కాకపోయినా సరే .... మీరంటే నాకు చాలా పూజ్య భావం. ఒక మంచి మనిషంటే ఎవరికి గౌరవం వుండదు?"

"సావిత్రీ!" వాసు సావిత్రి చెయ్యి గట్టిగా పట్టుకున్నాడు-

"మీలాంటి ఆడది కావాలి నాకు. ఆవేశంగా మాట్లాడుతున్నా ననుకోకండి. మతితప్పి మాట్లాడటంలేదు. ఇంతవరకూ సుజాతని ముట్టుకో లేదు. నేను మిమ్మల్ని పెళ్ళిచేసుకుంటాను. దేవుడిమీద ప్రమాణం చేస్తు న్నాను. మన సంబంధం గురించి అందరికీ చెప్పేస్తాను. మావాళ్ళు ఇష్ట పడకపోతే నేను వేరే కాపరం పెడతాను. మనం వెళ్ళిపోదాం రండి. ఒక్క క్షణంకూడా ఈ ఇంట్లో వుండను. నాతో తీసుకుపోతాను రండి....

నా మాట తోసిపారెయ్యకండి. సావిత్రీ! నేను నిన్ను పెళ్ళిచేసుకుంటాను" వాసు సావిత్రి రెండు చేతులూ పట్టుకున్నాడు.

సావిత్రి ప్రమాన్పడి నించుంది. వాసుని గుండెల్లో దాచుకుందామని పించింది. వాసు చేయి నిమురుతూ ఆర్ద్రితగా చూసింది—

"మిమ్మల్ని నేను శంకించటంలేదు. కానీ.... నన్ను మీరు కోర కూడదు. నాలాంటి ఆడపిల్లలు మీకు దొరక్కపోరు పెళ్ళిచేసుకోవాలంటే ....మీరు పెళ్ళికాని పిల్లనే చేసుకోండి. జీవితం నూరేళ్ళపంట. అందులో ఎలాంటి అపశృతులూ వుండకూడదు, కానీ....నా మాట వినరా ? సుజాని మీరు క్షమించలేరా ?"

"ఇంతేనా మీరు చెప్పేది ?" దీనంగా అన్నాడు వాసు.

సావిత్రి కళ్ళలోంచి రెండు కన్నీటి బొట్లు వాసు చేతులమీద పడాయి. "నేను నా భర్తనెంత ప్రేమించానో తెలిస్తే....మీరు నన్నిలా అడగరు. ఆయన స్మృతి నాకు పది జన్మలకు చాలు."

వాసు సావిత్రి చేతులు వదిలేశాడు— "క్షమించండి! నేను మీ మనసు తెలుసుకోలేదు. నన్ను అపార్థం చేసుకోవద్దు."

"కానీ ! మీరు...."

"ఒద్దు నాకేమీ చెప్పకండి."

"సావిత్రీ !" — ఇంట్లోంచి తల్లి పిల్చిన పిలుపు కర్కశంగా వినిపించింది.

సావిత్రి తడబడుతూ వెళ్ళిపోయింది.

సావిత్రిని తల్లి చీవాట్లు పెట్టటం వింటూ నించున్నాడు వాసు.

"ఇదేం పొయ్యేకాలమే నీకు ? .... అది మొగుడితో కాపరం చెయ్యటంలే దెగాగురా భగవంతుడా అని ఏడుస్తోంటే, నీ కిదేం బుద్ధి! అతనితో గుసగుస లేమిటి ? ఇద్దరి కిద్దరే ! — యింటా వంటా లేని దరిద్రులు బయిలేదారు. పరువు బజారు కెక్కిస్తున్నారు. తలెత్తుకోవటా నికి నాకిక దారిలేదు తల్లీ ! ఏ నుయ్యో....గొయ్యో.... చూసుకోవాలి నేను"

సావిత్రి వెక్కి వెక్కి ఏడుస్తోంది - మధ్య మధ్య నెమ్మదిగా నచ్చచెప్పాలని ప్రయత్నిస్తోంది— "అమ్మా! .... నే నేమీ మాట్లాడ లేదమ్మా! ఆయనకి .... దెబ్బ తగిలిందని .... నీళ్ళడిగితే ఇచ్చాను - నాకు మాత్రం తెలీదా - అన్యాయంగా నన్నెందు కంటావు?"

వాసు గబగబా వరండాలోంచి వెళ్ళాడు. గుమ్మంలో నిలబడ్డ అల్లుణ్ణిచూసి తెల్లబోయింది అత్తగారు. వాసు తీక్షణంగా అన్నాడు — "అనవసరంగా ఆవిణ్ని అనకండి. మీ పరువు ప్రతిష్ఠలు ఆవిడేమీ పాడు చెయ్యలేదు-మీలాంటివారు ఉండనేఉన్నారు. మీపరువు ప్రతిష్ఠలకేంలోటు? నాశనం అయితే నేను అవుతాను. మీ కుటుంబం గౌరవం ముందూ— పరువు ప్రతిష్టలముందూ ఒక మనిషి జీవితం ఎంత?— గడ్డి పరక! అంతకన్న ఎక్కువ కాదు. గిర్రున వెనక్కితిరిగిగదిలోకి వెళ్ళిపోయాడు. సుజాత గుమ్మానికి కరచుకుని బిక్కమొహంతో నిలబడివుంది. వాసు గబగబా బట్టలు వేసుకున్నాడు. సూట్‌కేస్ చేతిలోకి తీసుకున్నాడు.

సుజాత పెర్రిదానిలా వచ్చి వాసు పాదాలమీద పడింది.— వెక్కి వెక్కి ఏడుస్తూ కాళ్ళు రెండూ చుట్టేసింది — "నన్ను క్షమించండి— మీరు వెళ్ళిపోవద్దు. నా తప్పులన్నీ మర్చిపోండి. మీ యిష్టప్రకారం వుంటాను. మిమ్మల్ని బాధపెట్టను. నన్ను నమ్మండి. మీరు వెళ్ళిపోవద్దు —నన్ను క్షమించండి" అంటూ ఏడ్చింది.

వాసు కఠినంగా అన్నాడు — "నా సహనానికి హద్దువుంది. నీ పగివర్తనకి సమయం వుంది. అవి రెండూ మించిపోయాయి. ఇప్పుడు నా మనస్సులో నువ్వు లేవు. నేను నీతో కాపరం చెయ్యలేను. మనం భార్యాభర్తలం కాదు — స్నేహితుల్లా విడిపోదాం.

నిర్లక్ష్యంగా సుజాత చేతులు వదిలించుకుని ముందుకు నడిచాడు. అర్ధరాత్రి-హోరున కురుస్తోన్న వానలో మాయమయ్యాడు.

(1967 దీపావళి యువ నుంచి.)

—(౦)—